




సప్త వాహన సౌందర్యం

కనులపండువగా రథసప్తమి వేడుకలు

కిటకిటలాడిన తిరుమల మాడవీధులు





తిరుమల, ఆంధ్రజ్యోతి

మలయప్ప స్వామి సప్త వాహనసేవల ఊరేగింపులతో తిరుమల గిరులు పులకించిపోయాయి. వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు, గోవింద నామస్మరణలు, కర్పూర హారతులు, భజన బృందాల ప్రదర్శనలతో మాడవీధులు మార్మోగాయి. శుక్రవారం ఉదయం 5.30గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు జరిగిన వాహనసేవలను అశేష సంఖ్యలో భక్తులు దర్శించి తరించారు.ఎముకలు కొరికే చలిని సైతం లెక్కచేయకుండా 24గంటల పాటు గ్యాలరీల్లోనే ఉండి శ్రీనివాసుడి దర్శన భాగ్యంతో ఆనందపరవశులయ్యారు. సూర్యప్రభ వాహనసేవ సందర్భంగా శ్రీవేంకటేశ్వర బాలమందిరం విద్యార్థులు ఆలపించిన 'ఆదిత్యహృదయం', 'సూర్యాష్టకం' సంస్కృత శ్లోకాలు భక్తుల మనసుదోచాయి.వాహనసేవల్లో హిందూ ధర్మప్రచార పరిషత్, దాససాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి దాదాపు 900మంది కళాకారులు పాల్గొన్నారు. కోలాటం, లెజిమ్స్, దీపనృత్యం, కేరళ-ఓనం నృత్యం, జానపద నృత్యం, గోపికా నృత్యం, హారతి నృత్యం, అన్నమయ్య విన్నపాల నృత్యం, రాజస్థాన్-దాండియా నృత్యం, పుదుచ్చేరి-కరగాట్టం ,మోహినీ అట్టం, తెలంగాణ-గర్బ నృత్యం, బిందెల నృత్యం, కూచిపూడి నృనత్యం, మహారాష్ట్ర లావణి నృత్యం, అసోం-భుయ నృత్యం, బెంగాలీ నృత్యాలను అద్భుతంగా ప్రదర్శించారు.









ఎస్వీ బాలమందిరం విద్యార్థుల 'ఆదిత్యహృదయం' ఆలాపన

మాడవీధులను వీడని భక్తులు

రథసప్తమి వేడుకలను తిలకించడానికి గురువారం సాయంత్రం నుంచే భక్తులు గ్యాలరీల్లోకి చేరుకోవడం మొదలుపెట్టారు.సాధారణంగా సూర్యప్రభ వాహనం నుంచి చక్రస్నానం వరకు భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. తర్వాత నెమ్మదిగా తగ్గుతుంది. అయితే ఈసారి మాత్రం భక్తులు ఎక్కడి వారు అక్కడే కూర్చుండిపోయారు. రాత్రి 9 గంటల వరకు గ్యాలరీల్లోనే ఉండి వాహనసేవలన్నీ వీక్షించారు.అయితే ఎక్కడి నుంచి గ్యాలరీల్లోకి ప్రవేశించాలనే సమాచారం తెలియక చాలామంది ఇబ్బంది పడ్డారు. భక్తులతో కొన్ని చోట్ల భద్రతా సిబ్బంది దురుసుగా ప్రవర్తించడం, రాంభగీచ వద్ద తీవ్రస్థాయిలో నెట్టడం విమర్శలకు దారితీసింది.

షార్‌లో సందడి

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 16: నేటి ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహ ప్రయోగంతో శ్రీహరికోటలోని షార్‌లో సందడి వాతావరణం నెలకొంది.శనివారం సాయంత్రం 5.35 గంటలకు జరిగే జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్ ప్రయోగానికి సంబంధించిన కౌంట్‌డౌన్ శుక్రవారం మధ్యాహ్నం 2.05 గంటలకు ప్రారంభమైంది.ఈ నేపథ్యంలో షార్‌లో భద్రతను కట్టుదిట్టం చేశారు.శ్రీహరికోట చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు, సముద్ర మార్గాన కోస్టల్ గార్డ్స్, మెరైన్ సిబ్బంది, సీఐఎస్ఎఫ్ బలగాలతో జల్లెడపట్టి గాలిస్తున్నారు. షార్‌కు వెళ్లే మొదటి గేటులో వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపుతున్నారు. ఇప్పటికే షార్‌కు ఇస్రో సెంటర్ల డైరెక్టర్లు, శాస్త్రవేత్తలు చేరుకోవడంతో సందడి నెలకొంది. ఈ ఏడాది జనవరి ఒకటిన పీఎస్ఎల్వీ-సీ 58 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన విషయం తెలిసిందే. ఇదే ఉత్సాహంతో జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్‌ను ప్రయోగించేందుకు శాస్త్రవేత్తలు రెడీ అయ్యారు.షార్ నుంచి చేపట్టే ప్రయోగాల్లో ఇది 92వది కాగా జీఎస్ఎల్వీ-మార్క్.2 ప్రయోగాల్లో 16వ ప్రయోగం కావడం విశేషం.


జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్


మిథున్ రెడ్డిని కలిసిన డేవిడ్.ఫొటోలో రాజేష్ తదితరులు

సత్యవేడు టికెట్ ప్లీజ్

వైసీపీ అభ్యర్థి ఎదురుగానే కోరిన మాజీ జడ్పీటీసీ డేవిడ్

సత్యవేడు/కేవీబీపురం, ఫిబ్రవరి 16 : సత్యవేడు వైసీపీ అభ్యర్థి నూకతోటి రాజేష్‌కు కేవీబీపురం మాజీ జడ్పీటీసీ డేవిడ్ షాక్ ఇచ్చారు. ఎంపీ మిథున్ రెడ్డి సమక్షంలో రాజేష్ ఎదురుగానే స్థానికుడైన తనకు సత్యవేడు టికెట్ ఇవ్వాలని అభ్యర్థించడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. వైసీపీ సీనియర్ లీడర్, కేవీబీపురం మాజీ జడ్పీటీసీ డేవిడ్ సత్యవేడు వైసీపీ టికెట్ కోసం ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు.ఈ నేపథ్యంలో తన మద్దతుదారులను వెంటబెట్టుకుని, శుక్రవారం తిరుపతిలో ఎంపీ మిథున్ రెడ్డిని ఇంటి వద్ద కలిశారు. తనకు సత్యవేడు టికెట్ కేటాయించాలని కోరారు. తాను స్థానికుడని, నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో బంధువర్గం ఉందని, తొలినుంచీ పెద్దిరెడ్డి అనుచరుడిగా, ఆయన అడుగుజాడల్లో నడుస్తున్నానని చెప్పుకొచ్చారు.అయితే సత్యవేడు అభ్యర్థిగా రాజేష్ పేరును అధిష్ఠానం ఇప్పటికే ప్రకటించిందని, ఆయన గెలుపుకోసం అందరూ పనిచేయండని, పార్టీ అధికారంలోకి వస్తే తప్పకుండా న్యాయం చేస్తామని డేవిడ్‌కు మిథున్ హామీ ఇచ్చినట్లు సమాచారం. ఇదిలా ఉండగా ఈ సన్నివేశమంతా సత్యవేడు వైసీపీ అభ్యర్థి రాజేష్ ముందర చోటు చేసుకోవడం విశేషం. అభ్యర్థి పేరు ప్రకటించాక కూడా టికెట్ ఇవ్వాలంటూ స్థానిక నాయకులు పట్టుబడుతుండడం... అభ్యర్థి ముందరే టికెట్ కోరడం చర్చనీయాంశమైంది.ఈ పరిణామాలు సత్యవేడు వైసీపీలో చోటుచేసుకుంటున్న రాజకీయ సమీకరణలకు నిదర్శనమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

సిద్ధం సభకు బస్సులు పంపండి

విద్యాసంస్థలపై రవాణాశాఖ ఒత్తిళ్లు



తిరుపతి(విద్య), ఫిబ్రవరి 16 : అనంతపురంలో ఆదివారం జరిగే వైసీపీ సిద్ధం సభకు జిల్లాలోని ప్రైవేటు విద్యాసంస్థల బస్సులను పంపాలని ట్రాన్స్‌పోర్ట్ అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. సగం బస్సులను తప్పనిసరిగా పంపాలంటూ ఇప్పటికే మౌఖికంగా ఆదేశాలు జారీ చేశారు. శనివారం ఉదయం మీ ఫోన్లకు అందే సమాచారం మేరకు ఆయా పాయింట్లకు బస్సులను తీసుకురావాలని సూచించారు. దీంతో పిల్లలకు శుక్రవారం రవాణా సౌకర్యం కల్పించలేమని, తల్లిదండ్రులే స్కూల్‌కు తీసుకురావాలని పాఠశాలల యాజమాన్యాలు సమాచారం అందించాయి. బస్సులను అనంతపురం జిల్లాలోని గ్రామాలకు తీసుకెళ్లి ప్రజలను సభ వద్దకి తరలించే వరకు బాధ్యత వహించాలని చెబుతుండడంతో విద్యాసంస్థల యాజమాన్యాలకు దిక్కుతోచడం లేదు.జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలు, జూనియర్, డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన దాదాపు 500 బస్సులను అనంతపురానికి తీసుకెళ్లేలా అధికార పార్టీ నేతలు ఏర్పాట్లు చేసినట్లు తెలిసింది.

జూ పార్కులో లయన్ ఎన్‌క్లోజర్ మూసివేత

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 16: తిరుపతిలోని ఎస్వీ జూపార్కులో గురువారం లయన్ ఎన్‌క్లోజర్ దూకి సింహం బారిన పడి రాజస్థాన్‌వాసి ప్రహ్లాద్ గుర్జార్ మృతి చెందిన నేపథ్యంలో శుక్రవారం కూడా ఎన్‌క్లోజర్‌ను మూసివేశారు. పోలీసుల దర్యాప్తు అనంతరం ఎన్‌క్లోజర్‌ను తెరవనున్నట్లు క్యూరేటర్ సెల్వం తెలిపారు.ఎన్‌క్లోజర్ల వద్ద అదనపు గేట్లు ఏర్పాటు చేసి ఫెన్సింగ్‌ను కూడా రెండడుగులు పెంచుతామన్నారు.సందర్శనీయ ప్రాంతాల్లో కూడా సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.వైల్డ్ అనిమల్స్ ఉన్న చోట్ల నిరంతరం పహారా ఏర్పాటు చేసేందుకు అదనపు సిబ్బంది కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు.

జనసైనికులతో గూడూరు ఎమ్మెల్యే భేటీ



సత్యవేడు, ఫిబ్రవరి16: గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్ సత్యవేడు నియోజకవర్గ పరిధిలోని వరదయ్యపాళెంలో శుక్రవారం రాత్రి జనసైనికులతో సమావేశమయ్యారు.యాదవ నాయకుడు జానకీరామ్ నివాస గృహానికి ఆయన వచ్చిన విషయాన్ని తెలుసుకున్న జనసేన కార్యకర్తలు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీలో రెడ్ల ఆధిపత్యం, నియంత పోకడలు భరించలేకపోయినట్లు తెలిపారు. తన రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక ఓ ప్రధాన సామాజిక వర్గం తనపై నిందారోపణలు వేసి టికెట్ రాకుండా అడ్డుకుందని ఆరోపించారు. తనకు సీఎం జగన్ నామినేటెడ్ పదవి ఇస్తానన్నా వద్దని బయటకొచ్చేశానని తెలిపారు. రానున్న ఎన్నికల్లో జనసేన టికెట్ ఇస్తే తిరుపతి ఎంపీగా పోటీ చేస్తానన్నారు.టికెట్ ఇవ్వకపోయినా స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటానని,గతంలో ఎంపీగా తాను చేసిన సేవలను గుర్తుంచుకుని అండగా నిలవాలని వారిని కోరారు.

ఎస్వీ పాలిటెక్నిక్‌లో ఐదు కోర్సులకు ఎన్‌బీఏ గుర్తింపు

తిరుపతి(విద్య),ఫిబ్రవరి 16 : తిరుపతిలోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఐదు కోర్సులకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు లభించింది. కళాశాలలో ఆఫర్ చేస్తున్న 8బ్రాంచ్‌లకుగాను ఐదు కోర్సుల(ఈఈఈ, ఈసీఈ, కంప్యూటర్స్, మెకానికల్, బయోమెడికల్ ఇంజినీరింగ్)కు ఎన్‌బీఏ గుర్తింపు ఇచ్చింది. గత ఏడాది డిసెంబరులో పాలిటెక్నిక్‌ను సందర్శించిన ఎన్‌బీఏ ఎక్స్‌పర్ట్ టీమ్ ఇక్కడి తరగతి గదులను, ఫ్యాకల్టీని, ఆఫర్ చేస్తున్న ప్రోగ్రామ్స్‌ను, ల్యాబులను పరిశీలించి ఐదు బ్రాంచ్‌లకు గుర్తింపు ఇచ్చారని ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు.2023-24 విద్యాసంవత్సరం నుంచి 2026 జూన్30వరకు ఈ గుర్తింపు ఉంటుందని, తద్వారా పాలిటెక్నిక్‌కు అదనపు నిధులు మంజూరవుతాయని తెలిపారు.ఎన్‌బీఏ గుర్తింపు లభించిన సందర్భంగా ప్రిన్సిపాల్ నేతృత్వంలో అధ్యాపకులు, ఏవో తదితరులు సాంకేతిక విద్య కమిషనర్ సి.నాగరాణిని కలసి అభినందనలు అందుకున్నారు. ఎన్‌బీఏ కమిటీకి పాలిటెక్నిక్ జనరల్ విభాగం హెడ్ డాక్టర్ ఎస్వీ గౌరీశంకర్ కో ఆర్డినేటర్‌గా వ్యవహరించారు.


కమిషనర్ నాగరాణితో ఎస్వీ పాలిటెక్నిక్ బృందం




కల్యాణ వెంకన్న ఊరేగింపు - తిరుచ్చిపై ఊరేగుతున్న కోదండరాముడు

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న

చంద్రగిరి, ఫిబ్రవరి16: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో, చంద్రగిరిలోని కోదండరామాలయంలో శుక్రవారం రథసప్తమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అలంకరించి బంగారు తిరుచ్చి వాహనంపై అధిష్ఠించారు. ఉదయం 6 నుంచి 7 గంటల మధ్య శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న ఉత్సవర్లను ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి దక్షణమాడవీధిలో వేంచేపు చేసి, అక్కడ సూర్యకిరణాలు ఉత్సవర్లపై పడిన తరువాత స్వామివారు ఆలయానికి చేరుకున్నారు. అదేవిధంగా చంద్రగిరిలోని కోదండరామాలయంలో సీతారామలక్ష్మణ సమేత హనుమ ఉత్సవర్లను విశేషంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై అధిష్ఠించారు. ఉదయం 9 నుంచి 11 గంటల మధ్య చంద్రగిరి పట్టణంలో ఊరేగించారు. ఈ కార్యక్రమాలలో టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లుముని చెంగ్రాయులు, వెంకటస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్‌రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు బాలాజిరంగాచార్యులు, పార్థసారధి, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, కోదండరామాలయం డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ప్రధాన అర్చకులు శ్రీనివాస భట్టర్, అర్చకులు నరసింహన్, మోహన్‌స్వామి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనారాయణుడికి తిరుమంజనం

రామచంద్రాపురం, ఫిబ్రవరి 16: రాయలచెరువుకట్ట భవానీ జలకంఠేశ్వర ఉపాలయంలో వెలసిన లక్ష్మీనారాయణస్వామికి శుక్రవారం శాస్త్రోక్తంగా తిరుమంజనం జరిగింది. రథసప్తమి సందర్భంగా ఆలయంలో విశేష పూజల అనంతరం భవానీ జలకంఠేశ్వరస్వామివారితో పాటు లక్ష్మీనారాయణస్వామికి తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

చంద్రగిరిలో 30వేలకు పైగా దొంగ ఓట్లు

● కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బడి సుధాయాదవ్



తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 16: చంద్రగిరి నియోజకవర్గంలో 30వేలకు పైగా దొంగ ఓట్లు నమోదయ్యాయని ఓబీసీ సంఘ నేత బడి సుధాయాదవ్ ఆరోపించారు. శుక్రవారం తిరుపతి కలెక్టరేట్‌లో లక్ష్మీశను కలిసి వినతిపత్రం సమర్పించారు.చంద్రగిరిలో బీఎల్వోలపై అధికార పార్టీ నేతలు ఒత్తిళ్ల చేసి దొంగ ఓట్లు నమోదుకు ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉన్నారన్నారు. జీరో డోర్ నెంబరు, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లు, డెత్ ఓటర్లు తొలగించకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. తిరుపతి పార్లమెంటు ఎన్నికల్లో జరిగినట్లు అవకతవకలు జరగకుండా ఓటర్ల తుది జాబితా సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆలోచింపజేస్తున్న రాజధాని ఫైల్స్ : నాని



ప్రచారం చేస్తున్న పులివర్తి నాని, ఈశ్వరరెడ్డి

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 16: రాజధాని ఫైల్స్ సినిమా అందరినీ ఆలోచింపజేస్తోందని చంద్రగిరి టీడీపీ ఇన్‌చార్జి పులివర్తి నాని పేర్కొన్నారు.తిరుపతి రూరల్ మండలం సాయినగర్‌లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సంద్భంగా నాని మాట్లాడుతూ రాజధాని విషయంలో జగన్ విష ప్రచారం చేశారన్నారు. అమరావతి విధ్వంసంపై కళ్లకు కట్టినట్టుగా వాస్తవాలను ఈ సినిమాలో చిత్రీకరించారన్నారు. ప్రజాసేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చానని చెప్పే ఎమ్మెల్యే, చేసేది మాత్రం వ్యాపారమని ఆరోపించారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రస్తుతం ఒంగోలుకు మకాం మార్చారని చెప్పారు. గత పదేళ్లలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం చేపట్టలేదని విమర్శించారు. నాలుగు పదవులు అడ్డం పెట్టుకొని రూ. 5 వేల కోట్ల ప్రజాధనాన్ని, ప్రకృతి సంపదను దోచేశారని అన్నారు. తనకు ఒక్క అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రూరల్ టీడీపీ అధ్యక్షులు ఈశ్వర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను మార్చి ఇల్లు రిజిస్ట్రేషన్

● ఖాళీ చేయాలని బెదిరిస్తున్న వైసీపీ నాయకుడు

● న్యాయం చేయాలని వేడుకుంటున్న బాధితుడు

చంద్రగిరి,ఫిబ్రవరి16: చంద్రగిరి మండలం పనపాకం పంచాయతీ అరిగిలవారిపల్లెలో సర్వే నెంబరు 478-2 పట్టా భూమిలో ఉండే ఇంటిని వేరొకరి పేరులో ఇంటి పన్ను మార్చి విక్రయించారని, దానిని కొన్న అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు ఇంటిని ఖాళీ చేయాలని బెదిరిస్తున్నాడని జగ్గారావు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.అరిగిలవారిపల్లెవాసి కాగునూరు చెంగయ్యకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు మునెమ్మ, చిన్నమునెమ్మ, మునస్వామి, మునిరత్నం, సరోజమ్మ, కృష్ణయ్య ఉన్నారు. వీరిది ఉమ్మడి కుటుంబ కావడంతో ఇంటి వ్యవహారాలు మునిరత్నం చూసుకుంటున్నాడు. అరిగిలవారిపల్లెలో ఉమ్మడి కుటుంబంతో ఉంటున్న ఇంటికి రెండవ కుమారుడు మునిరత్నం పేరుతో ఇంటి పన్ను చెల్లిస్తున్నారు.ఆయన మరణించాక ఇంటి పన్నును నేరుగా మునిరత్నం కుమార్తె అయిన కాంతమ్మ పేరుతో మార్చారు. ఉమ్మడి ఆస్తులను పంచుకోవాలని ఇరువర్గాలు కోర్టుకు వెళ్లారు. దీంతో ఆస్తులు పంచుకోవడానికి కోర్టు తీర్పు ఇచ్చింది. కొవిడ్ సమయంలో కాంతమ్మ కూడా మరణించడంతో ఆమె కుమారుడు లోకేష్ యాదవ్ పేరుతో గతేడాది జనవరి 4న ఇంటి పన్నును మార్చుకుని ఆ ఇంటిని అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. ఆలస్యంగా ఈ విషయం వెలుగులోకి రావడంతో మునస్వామి కుమారుడు జగ్గారావు పంచాయతీ కార్యదర్శిని నిలదీశాడు. ఆన్‌లైన్‌లో కూడా కాంతమ్మ పేరుతోనే ఇంటి పన్ను ఉందని సమాధానం ఇచ్చారన్నారు. అంతేకాకుండా జగ్గారావు ఉంటున్న ఇంటిని ఖాళీ చేయాలని వైసీపీ నాయకుడు బెదిరిస్తుండడంతో జగ్గారావు స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. తన వద్దవున్న పత్రాలను పరిశీలించి న్యాయం చేయాలని కోరాడు.

స్పందన కరువైన జగనన్నకు చెబుదాం

అట్టహాసంగా నిర్వహిస్తే వచ్చింది 39 అర్జీలే



పాకాల, ఫిబ్రవరి 16:స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి స్పందన అంతంత మాత్రమే. కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని అధికారులు ప్రకటించారు. మండలంలోని ప్రజలందరూ తమ సమస్యలు, విన్నపాలు అర్జీల రూపంలో సమర్పించి పరిష్కరించుకోవాలని కోరారు. అయితే ఈ కార్యక్రమానికి కలెక్టర్ హాజరు కాలేదు. డీఐవో సుశీలాదేవి ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు 50 మందికి పైగా పాలొన్నా ప్రజలు 39 అర్జీలు మాత్రమే అందజేశారు.జట్పీటీసీ నంగా పద్మజరెడ్డి, ఎంపీడీవో నాగేంద్రబాబు, తహసీల్దార్ వాణిశ్రీ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ జి.వెంకట్రమణ, ఆర్‌అండ్‌బీ డీఈఈ సుబ్రమణ్యం రెడ్డి, డీటీ డబ్ల్యూవో సూర్యనారాయణ, డ్వామా ఏపీడీ పద్మలత హరిత, శ్రీధర్, రూపారామ్, మాధవి, శ్యామ సుందరరావు, బాలు నాయుడు, కన్నయ్య వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై సీఐటీయూ ధర్నా

పాకాల, ఫిబ్రవరి 16: కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలు నిరసిస్తూ ఆర్టీసీ బస్టాండు ఎదుట సీఐటీయూ, కేవీపీఎస్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలతో పాలన సాగిస్తున్నాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు, సహజ వనరులను కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ఇస్తున్నాయన్నారు. దేశ ఆర్థిక స్వావలంబనకు ముప్పుతెస్తున్న ఈ విధానాలను మానుకోవాలన్నారు. కార్మికులకు, రైతులకు న్యాయం చేయాలని కోరారు.





గోవిందరాజస్వామి ఆలయంలో కళాకారుల సందడి - స్వామిని దర్శించుకుంటున్న నగర వాసులు - సూర్యప్రభ వాహనంపై కోదండరామస్వామి

వేడుకగా రథసప్తమి

తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 16: రథసప్తమి సందర్భంగా శుక్రవారం తిరుపతిలోని కోదండ రామస్వామి, గోవిందరాజస్వామి ఆలయాలలో వివిధ వాహన సేవలు నిర్వహించారు. కోదండరామాలయంలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు సూర్యప్రభ వాహనంపై కోదండ రాముడు మాడ వీధులలో విహరించారు. రాత్రి 7 గంటలకు చంద్రప్రభ వాహన సేవ జరిగింది. గోవిందరాజస్వామి ఆలయంలోనూ వేకువజామున 3 గంటలకు చక్రత్తాళ్వారును ఊరేగింపుగా కపిలతీర్థంలోని పుష్కరిణికి తీసుకువచ్చి, చక్రస్నానం నిర్వహించారు. ఉదయం 5.30 గంటలకు సూర్యప్రభ వాహనంతో సేవలు మొదలు కాగా వరుసగా హంస వాహనం, హనుమంత వాహనం, పెద్దశేష వాహనం, ముత్యపు పందిరి, సర్వభూపాల వాహనాలపై స్వామివారు ఆలయ మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. రాత్రి 7 నుంచి 8.30 వరకు గరుడవాహన సేవ నిర్వహించారు. ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి పాల్గొన్నారు.



తేజోమయి... నమో నమః

● తిరుచానూరులో రథసప్తమి వేడుకలు

● అశ్వవాహనంపై సూర్యభగవానుడి సాక్షాత్కారం

తిరుచానూరు, ఫిబ్రవరి 16: శ్రీవారి దేవేరి పద్మావతిదేవి కొలువై ఉన్న తిరుచానూరులో శుక్రవారం అంగరంగ వైభవంగా రథసప్తమి వేడుకలు జరిగాయి. అమ్మవారు ఉదయం నుంచి సాయంత్రం వరకు సప్తవాహనాలపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.వివిధ రూపాల్లో అమ్మవారిని చూసి భక్తులు ఆనంద పరవశులయ్యారు. వేకువజామున అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చకులు నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని వాహన మండపానికి వేంచేపు చేశారు. ఉదయం 7.15గంటలకు సూర్యప్రభ వాహనంతో ప్రారంభమై మధ్యహ్నం రెండు గంటల వరకు హంస, అశ్వ, గరుడ, చిన్న శేషవాహనాలపై అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం కేటీ మండపంలో అమ్మవారికి సుగంధ పరిమళ ద్రవ్యాలతో స్నపన తిరుమంజనం జరిగింది. సాయంత్రం 6గంటలకు చంద్రప్రభ, రాత్రి 8.30గంటలకు గజవాహన సేవ వేడుకగా జరిగింది. అమ్మవారిని భక్తులు దర్శించుకుని నారికేళ, కర్పూర హారతులు సమర్పించారు. గజ, తురగ, వృషభాలు ముందు వెళుతుండగా భజన బృందాలు, భక్తుల కోలాటాలు, ప్రబంధ వేద పారాయణం మధ్య తిరుమాడవీధుల్లో అమ్మవారి వాహన సేవలు నేత్రానందంగా సాగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, అర్చకులు బాబుస్వామి, ఏవీఎస్‌వో శైలేంద్రబాబు, సూపరింటెండెంట్‌లు మధు, శేషగిరి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అశ్వవాహనంపై సూర్యభగవానుడి సాక్షాత్కారం

రథసప్తమిని పురస్కరించుకుని సూర్యనారాయణ స్వామి ఆలయంలో అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. వేకువ జామున మూలమూర్తికి అభిషేకం నిర్వహించారు. విశేషాలంకారంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 6గంటలకు సూర్యనారాయణస్వామి అశ్వవాహనంపై కొలువుదీరి ఆలయం మాడవీధుల్లో ఊరేగారు.



నిరవధిక సమ్మెలోకి వ్యవసాయ కళాశాల కార్మికులు



దీక్ష చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 16: సమస్యలు పరిష్కరించాలని ఎస్వీ వ్యవసాయ కళాశాలలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులు శుక్రవారం ఆ కళాశాల ప్రధాన ద్వారం వద్ద నిరవధిక సమ్మెకు దిగారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మద్దతు ప్రకటించి సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 22సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. జిల్లా నాయకులు నాగరాజు, జయచంద్ర మాట్లాడుతూ ప్రతి నెలా జీతాలు ఇవ్వాలని, టైంస్కేల్, ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాదబీమా, ప్రసూతి, ప్రభుత్వ సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు గండికోట చినబాబు, టైంస్కేల్ ఉద్యోగ సంఘ నాయకుడు మురళి, సంఘ అధ్యక్షురాలు వరలక్ష్మి, కార్యదర్శి రాకేష్, నాయకులు సుబ్బు, రేవతి, చంద్రమ్మ, అనురాధ, మునిలక్ష్మి, రమా తదితరులు పాల్గొన్నారు.

20న ఐటీఐలో ఉద్యోగమేళా

తిరుపతి(విద్య),ఫిబ్రవరి16: పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 20న ఉదయం 10గంటలకు ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జూనియర్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఎస్.వెంకటరమణ పేర్కొన్నారు. అపోలో ఫార్మసీ, బ్లిస్ సంస్థలలో రిటైల్ ట్రైనీ, ఫార్మసిస్ట్, ఎలక్ట్రీషియన్ ఉద్యోగాల కోసం ఈమేళా నిర్వహిస్తున్నామని, పదవ తరగతి నుంచి డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, ఫార్మసీ కోర్సులు చదివిన వారు అర్హులని తెలిపారు. వయసు 18-30లోపు ఉండాలని, ఎంపికైన వారికి నెలకు రూ.13,500-20వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు. ఇతర వివరాల కోసం 639429950ను సంప్రదించాలని కోరారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి



తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 16: తెలుగు వల్లభుడుగా పేరుపొందిన శ్రీకృష్ణదేవరాయల జయంతి వేడుకను శుక్రవారం తిరుపతిలోని రాయలసీమ రంగస్థలి సంస్థ నిర్వహించింది. ఫైవేటు కళావేదికలో జరిగిన కార్యక్రమంలో తిరుపతిలోని పలువురు కళాకారులు శ్రీకృష్ణదేవరాయల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. కళాకారుడు కొత్తపల్లి మునిరత్నంను సత్కరించారు. సంస్థ అధ్యక్షుడు గోపినాథరెడ్డి,కార్యదర్శి కేఎన్.రాజ, శాంబోలు హరినాథ్, జయరామయ్య, సాయినవీన్, కేశవుల రెడ్డి, బెల్లంకొండ రత్నం పాల్గొన్నారు.

డేటా సైన్స్‌పై సదస్సు ప్రారంభం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 16: ఎస్వీయూలో డేటా సైన్స్‌పై శుక్రవారం అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. ఇటలీకి చెందిన మైఖేల్, వర్సిటీ డీన్ విజయభాస్కరరావు పాల్గొని మాట్లాడారు. డేటా సైన్స్ రంగానికి చాలా ప్రాధాన్యత ఉందన్నారు. విద్యార్థులకు ఉపాధి అవకాశాలు బాగా లభిస్తున్నాయని చెప్పారు. అంతకుముందు ఆర్‌ఏ ఫిషర్ చిత్రపటానికి వారు నివాళి అర్పించారు.

సుప్రీం కోర్టు తీర్పుపై ఆర్యవైశ్యుల హర్షం



మీడియాతో మాట్లాడుతున్న ఆర్యవైశ్యులు

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 16 : పంగులూరి సీతమ్మ భూములపై సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుపై ఆర్యవైశ్యులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం కొత్తవీధిలోని కన్యకాపరమేశ్వరి ఆలయ పాలకమండలి చైర్మన్ పామిడి సత్యనారాయణ, కార్యదర్శి దిండుకుర్తి నరసింహులు మీడియాతో మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా కోర్టు కేసులో ఉన్న సీతమ్మ భూములు తాజా తీర్పుతో పాలకమండలికి స్వాధీనమయ్యాయని తెలిపారు. వారసులు లేకపోవడంతో కన్యకాపరమేశ్వరి ఆలయ ట్రస్టుకు అప్పగిస్తూ అప్పట్లోనే దివంగత సీతమ్మ వీలునామాలో పేర్కొందని గుర్తు చేశారు. ఆ తర్వాత కొంతకాలానికి ఆమె వంశస్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారన్నారు. అప్పటి నుంచి పాలకమండలి తరఫున తాము పోరాడామన్నారు. గురువారం సుప్రీం కోర్టు పాలకమండలికి అనుకూలంగా తీర్పు ప్రకటించిందన్నారు. ఆమె ఇచ్చిన వీలునామా ప్రకారం 42ఎకరాలు ఉండగా దాదాపు 22ఎకరాలు అన్యాక్రాంతమైనట్లుగా గుర్తించామన్నారు. ఆక్రమణదారులు పేదలకు విక్రయించారని, వారికి తగిన న్యాయం చేస్తామని తెలిపారు. త్వరలోనే ఆ స్థలంలో అమ్మవారి 102 అడుగుల విగ్రహం, ఆలయం, కల్యాణ మండపం, పాఠశాల, ఉచిత వసతి సముదాయాలు నిర్మిస్తామన్నారు. ఈ సమావేశంలో కొండూరు మహేష్, శ్రీధర్, వెంకటేశ్‌గుప్త, రాజేష్, రవి పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 16: జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా విజయవాడ నుంచి శుక్రవారం రాత్రి వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి ఎస్పీ మలిక గర్గ్, జేసీ శుభం బన్సల్, అదనపు ఎస్పీ వెంకట్రావుతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద తీసుకుంటున్న చర్యలను వివరించారు. జిల్లాలో ఫారం 6, 7, 8 అంశాలపైనా వివరాలు తెలిపారు. డీఆర్వో పెంచలకిషోర్, ఎస్డీసీలు కోదండరామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు పావని, ఆశా, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న కొత్త పల్సర్

మార్కెట్లోకి సరికొత్త పల్సర్

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 16 : ఎయిర్ బైపాస్ రోడ్డులోని ఎంజీబీ బజాజ్ షోరూంలో శుక్రవారం సాయంత్రం పల్సర్ 150 డబుల్ డిస్క్ వాహనాన్ని ఎస్వీయూ క్యాంపస్ సీఐ మురళీమోహన్ రావు చేతుల మీదుగా మార్కెట్‌లోకి విడుదల చేశారు. షోరూం జనరల్ మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ యువత భద్రతను దృష్టిలో ఉంచుకుని అత్యంత సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన బ్లూటూత్, కాలింగ్ ఫంక్షన్, అధునాతన సదుపాయాలు ఇందులో పొందుపరిచినట్లు వివరించారు. అన్ని రంగులలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టూవీలర్ అసోసియేషన్ నగరాధ్యక్షుడు మునిరెడ్డి, షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

ఐఆర్ ప్రకటించండి ప్లీజ్

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 16: టీటీడీ ఎంప్లాయీస్ బ్యాంకు, సంక్షేమ సంఘం అధ్యక్షుడు చీర్లకిరణ్ శుక్రవారం తాడేపల్లెలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని కలసి పీఆర్సీ ఆలస్యమవుతున్న కారణంగా ఐఆర్ ప్రకటించాలని కోరారు. అలాగే పెండింగ్‌లో ఉన్న డీఏను మంజూరు చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను త్వరగా రెగ్యులరైజేషన్ చేయాలని, పెండింగ్ టీటీడీ ఫైల్స్‌ను త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఐదుగురికి జరిమాన

తిరుపతి(లీగల్), ఫిబ్రవరి 16: అధిక మోతాదులో మద్యం తాగి వాహనాలు నడిపిన ఐదుగురికి రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి 4వ అదనపు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు. వీరిని ట్రాఫిక్ కానిస్టేబుల్ గిరిబాబు కోర్టులో హాజరుపరిచారు.

న్యాయవాదుల ఉద్యమం జగన్‌కు కనిపించదా?



తిరుపతి(లీగల్), ఫిబ్రవరి 16: ఏపీ ల్యాండ్ టైటిల్ యాక్ట్‌కు వ్యతిరేకంగా 40 రోజులుగా న్యాయవాదులు రిలే నిరాహారదీక్ష చేస్తుంటే సీఎం జగన్ పట్టించుకోకపోవడం బాధాకరమని తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ విమర్శించారు. తిరుపతి కోర్టులో న్యాయవాదుల రిలే నిరాహారదీక్ష శిబిరాన్ని శుక్రవారం ఆమె సందర్శించి, మద్దతు ప్రకటించారు. ఆమె మాట్లాడుతూ భూ కబ్జాల కోసం ఇలాంటి చీకటి చట్టాలను తయారు చేశారని ధ్వజమెత్తారు. చట్టాన్ని రద్దు చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు జి.నరసింహయాదవ్, మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ, సీనియర్ నాయకులు ఊకా విజయ్‌కుమార్, మబ్బు దేవనారాయణరెడ్డి, మునికృష్ణ, మునిశేఖర్‌రాయల్, మహేష్‌యాదవ్, శ్రీనివాసులు, న్యాయవాదులు అప్పిలి ఉమాపతి, చక్రవర్తి, హరిబాబు, గిరీష్, నరేంద్రకుమార్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కాలూరులో ఆలయ నిర్మాణంపై వివాదం

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 16:సి.మల్లవరం పంచాయతీ కాలూరులో రామాలయ నిర్మాణంపై వివాదం రేగుతోంది. ఆలయ నిర్మాణానికి సంబంధించిన పనులు రెండు రోజుల క్రితం ప్రారంభం అయ్యాయి. అయితే నిర్మాణం చేపట్టిన భూమిలో తమభూమి కూడా ఉందని చింతకాయల జయమ్మ పనులను అడ్డుకున్నారు. దీంతో గ్రామస్తులు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు విచారణ చేపట్టి సామరస్యంగా సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు.



ఆలయ నిర్మాణ పనులను అడ్డుకుంటున్న దృశ్యం

బస్టాండులో సిద్ధం బోర్డుల తొలగింపు



సిద్ధం బోర్డు తొలగించిన దృశ్యం

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 16: సెంట్రల్ బస్టేషన్‌లోని పల్లెవెలుగు బస్టాండు వద్ద ఏర్పాటు చేసిన సిద్ధం బోర్డులను అధికారులు తొలగించారు. బస్టాండులో సిద్ధం బోర్డుల ఏర్పాటుపై గత మంగళవారం ఆంధ్రజ్యోతిలో 'భక్తిక్షేత్రంలో బస్టాండునైనా వదలండయ్యా' అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆర్టీసీ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బస్టాండులో రాజకీయపరమైన ఫ్లెక్సీలను ఏర్పాటు చేయకూడదని ఆదేశించడంతో వెంటనే తొలగించారు.

హామీలు వద్దు.. స్టైఫండ్ ఇవ్వండి

● రెండో రోజూ కొనసాగిన జూనియర్ డాక్టర్ల నిరసన



రుయాస్పత్రి ముందు బైఠాయించిన జూనియర్ డాక్టర్లు

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 16 : తమకు హామీలు వద్దని, రావాల్సిన ఐదు నెలల స్టైఫండ్ ఇస్తే చాలని జూనియర్ డాక్టర్లు స్పష్టం చేశారు. నిరసన కార్యక్రమాల్లో భాగంగా వారు శుక్రవారం రుయాస్పత్రి ఎదుట బైఠాయించారు. గురువారం కలెక్టర్ లక్ష్మీశ హామీ ఇవ్వడంతో వారు తాత్కాలికంగా నిరసన కార్యక్రమాన్ని విరమించినా శుక్రవారం మళ్లీ ఆందోళనకు దిగారు. అధికారుల హామీలు నమ్మి వెనుకాడితే తమ విషయం పట్టించుకునే వారు ఉండరని తెలిపారు. ఒక్కొక్కరికి ఐదు నెలలకు సంబంధించి రూ.లక్షకు పైగా స్టైఫండ్ రావాల్సి ఉందని, వెంటనే చెల్లించాలని కోరారు. అప్పటివరకు నిరసన తెలియజేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.

ఎడెక్స్ విధానంతో ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 16: ఎడెక్స్ విద్యా విధానం ద్వారా యూనివర్సిటీలోని విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు లభ్యమయ్యే అవకాశం ఉంటుందని ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. ఎడెక్స్ కోర్సుల ప్రారంభ కార్యక్రమాన్ని ఆన్‌లైన్ ద్వారా శుక్రవారం నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాత యూనివర్సిటీలైన ఆక్స్‌ఫర్డ్, హార్వర్డ్, క్వీన్స్‌ల్యాండ్ తరహా విద్యా విధానాన్ని మన రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో అమలు చేయడానికి ప్రయత్నం జరుగుతోందన్నారు. స్కిల్ ఓరియెంటెడ్ కోర్సుల నిర్వహణకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఎడెక్స్ కోర్సుల్లో ప్రవేశానికి ఎస్వీయూ నుంచి 28 వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్టు చెప్పారు. ఎస్వీయూ, పద్మావతి, స్విమ్స్, వెటర్నరీ, అగ్రికల్చర్ యూనివర్సిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 35మంది సిద్ధార్థ విద్యార్థుల ఎంపిక



విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ప్లేస్‌మెంట్స్ డైరెక్టర్

తిరుపతి(విద్య),ఫిబ్రవరి16: తిరుపతి రూరల్ మండలం సి.గొల్లపల్లెలో ఉన్న సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో బెంగళూరుకు చెందిన ఆల్‌సెక్ టెక్నాలజీస్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. సంస్థ హెచ్‌ఆర్ రఘు నేతృత్వంలో నిర్వహించిన ఇంటర్వ్యూలలో తమ కళాశాలలో వివిధ గ్రూపులలో ఫైనలియర్ చదివే 35మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్ పేర్కొన్నారు. వీరికి నియామక పత్రాలను అందజేశారు. ఎంపికైన వారిని చైర్మన్ వై.కొండారెడ్డి, సెక్రటరీ వై.ఆనందరెడ్డి, వైస్‌ప్రెసిడెంట్ వై.విజయ్‌రెడ్డి, ప్లేస్‌మెంట్స్ డైరెక్టర్ స్వామినాథ్, భాస్కర్ అభినందించారు.

ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్ సిల్వర్ జూబ్లీ వేడుకలు

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 16 : తిరుపతిలో ఎన్టీఆర్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేసి 27 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇప్పటివరకు 110 సార్లు రక్తదానం చేసిన టి.లక్ష్మీరమణారావును సన్మానించారు. అనంతరం ట్రస్టు సిబ్బంది రక్తదాతలతో కలిసి కేకు కట్ చేశారు. డాక్టర్ సీతారామరాజు, ఎన్టీఆర్ ట్రస్టు సిబ్బంది గోపి, రవి, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

ఇసుక మాఫియాను అరికట్టండి

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 16: ఇసుక మాఫియాను అరికట్టి, స్వర్ణముఖి నదిని రక్షించాలని రాయలసీమ పోరాట సమితి కన్వీనర్ నవీన్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. స్వర్ణముఖిలో ఇసుక అక్రమ తవ్వకాలపై శుక్రవారం ఆయన స్పందించారు. ఇసుక మాఫియాను అరికట్టడంలో రెవెన్యూ, పోలీసు యంత్రాంగం విఫలమైందన్నారు. కలెక్టర్, ఎస్పీ వెంటనే స్పందించి ఇసుక మాఫియాకు అడ్డుకట్ట వేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్జీటీ, సీబీసీబీ నదీ పరివాహక ప్రాంతాలను కాపాడాలని హైకోర్టుకు నివేదించడం శుభ పరిణామమన్నారు. తిరుపతి రూరల్‌లోని చిగురువాడ, పైడిపల్లె, అడపారెడ్డిపల్లె, దుర్గసముద్రం, తనపల్లె, తిరుచానూరు, శానంబట్ల, తండ్లం, గాజులమండ్యం ప్రాంతాల్లో 30 అడుగుల లోతుగా స్వర్ణముఖిని తవ్వేశారని చెప్పారు. నదిని ఆనుకుని ఉన్న శ్మశానాలను కూడా తవ్వేస్తున్నారని తెలిపారు. అడ్డుకోకపోతే ప్రత్యక్ష ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు.

తిరుపతి

ఘనంగా రథసప్తమి


పూజ చేస్తున్న ప్రిన్సిపాల్ ప్రకాశ్‌బాబు, అధ్యాపకులు

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 16: టీటీడీ ఆధ్వర్యంలో నడిచే ఎస్వీ జూనియర్ కళాశాలలో శుక్రవారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ సి.ప్రకాశ్ బాబు నేతృత్వంలో సూర్యభగవానుడికి ఆదిత్య నామావళితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యార్థులతో సూర్య నమస్కారాలు వేయించారు. బాలమందిరం విద్యార్థులు ఆదిత్య హృదయాన్ని పఠించారు. డీపీపీ డైరెక్టర్ సోమయాజులు, ప్రోగ్రాం ఆఫీసర్ రాజగోపాల్, ప్రోగ్రాం అసిస్టెంట్ కోకిల, అధ్యాపకులు పి.ప్రియవర్ధన్‌బాబు, గంగాధర్‌రావు, రమణమ్మ, లక్ష్మీప్రసన్న, చెన్నారెడ్డి, శ్రీనివాసులునాయుడు, లోకేష్‌రెడ్డి, యోగా టీచర్ డాక్టర్ పీఎస్ ఆనందరావు పాల్గొన్నారు.

వెంకన్న సేవలో ప్రముఖులు


ఝార్ఖండ్ గవర్నర్ రాధాకృష్ణన్

తిరుమల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఝార్ఖండ్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

రుయాలో రోగులకు తప్పని వెతలు

- చేయి తడిపితే కానీ కదలని సిబ్బంది


ఆక్సిజన్‌తో స్ట్రెచర్‌పై ఉన్న వ్యక్తిని నెట్టుకువెళుతున్న కుటుంబ సభ్యులు

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 16 : రుయాలో రోగులకు తిప్పలు తప్పడం లేదు. ఎఫ్ఎన్‌వో, ఎంఎన్‌వోలు చేయి తడపనిదే సాయంగా రాకపోతుండటంతో రోగుల సహాయకులే కష్టాలు పడాల్సి వస్తోంది. శుక్రవారం అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్న పలువురు రోగుల పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్య పరీక్షలకు తీసుకువెళ్లాల్సి వచ్చింది. సిబ్బంది డబ్బు డిమాండ్ చేయడంతో ఇచ్చుకోలేక రోగుల సహాయకులే ఓ పక్క స్ట్రెచ్చర్‌ను మరో పక్క ఆక్సిజన్ సిలిండర్లను నెట్టుకుంటూ తీసుకువెళ్లాల్సి వచ్చింది. మరికొందరు పారిశుధ్య కార్మికుల సాయంతో స్ట్రెచ్చర్‌లపై రోగులను నెట్టుకుంటూ వెళ్లాల్సి వచ్చింది. అడిగే వారు లేకపోవడం వల్లే సిబ్బంది మరింత రెచ్చిపోతున్నారనే విమర్శలున్నాయి. రుయా అధికారులు ఇలాంటి వారిపై దృష్టి సారించి, రోగులకు ఇబ్బంది లేకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తిరుపతి రాజధాని కోసం.....



దర్నాలో పాల్గొన్న చింతా మోహన్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), తిరుపతి(తిలక్‌రోడ్డు), ఫిబ్రవరి 16: తిరుపతిలో రాజధాని ఏర్పాటు చేయాలని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతా మోహన్ కోరారు. ఇదే డిమాండ్‌తో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎస్వీ యూనివర్సిటీలో శుక్రవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ తిరుపతిలో రాజధాని ఏర్పాటవుతుందని కాలజ్ఞాని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆనాడే చెప్పారని గుర్తు చేశారు. రాయలసీమలో రాళ్లు ఉంటే, ఆంధ్ర ప్రాంతానికి నీళ్ల దక్కుతున్నాయని తెలిపారు. రైతులు పండించే టమోటా కేజీ ఒక్క రూపాయి కూడా పలకడం లేదన్నారు. రాయలసీమలో ఒక్క పూట కూడా అన్నం తినని ప్రజలు ఉన్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగాన్ని పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎస్వీయూలోనే చదువుకున్న టీడీపీ అధినేత చంద్రబాబు రాయలసీమను మోసం చేశారని తెలిపారు. ఎస్వీయూ పూర్వ విద్యార్థి, మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తనయుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కూడా ఈ ప్రాంతానికి తీవ్రమైన అన్యాయం చేశారని మండిపడ్డారు. తుళ్లూరు, వైజాగ్ రెండూ రాజధానులుగా పనికి రావన్నారు. బ్రహ్మంగారు చెప్పిన ప్రతి మాటా నెరవేరిందని, తిరుపతి రాజధాని విషయం కూడా నెరవేరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాళ్లు కాదు - రాజధాని కావాలంటూ నినాదాలు చేశారు. అంతకుముందు ఆయన ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నిరుపేద దళిత, గిరిజనుల అప్పుల మాఫీపై తొలి సంతకం పెట్టనున్నట్లు చెప్పారు. ఈ అంశాన్ని మ్యానిఫెస్టోలో చేర్చనున్నట్లు తెలిపారు. ఎలక్టోరల్ బాండ్ల రద్దుపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో ధర్మం గెలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో తేజవతి, రవి, శాంతియాదవ్, మునిశోభ, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.03 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.03 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం లెక్కించి శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక, గురువారం 45,825 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 21,380 మంది తలనీలాలు సమర్పించారు.

స్విమ్స్‌లో పోస్టులకు 22న వాక్‌ఇన్ ఇంటర్వ్యూలు

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 16 : స్విమ్స్ పరిధిలోని శ్రీబాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ(బీఐవో) ద్వారా క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహణ కోసం డాక్టర్లు, సిబ్బంది నియామకాల కోసం ఈనెల 22న స్విమ్స్‌లో వాక్‌ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ అపర్ణబిట్ల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెడికల్ ఆఫీసర్లు 3 (ఓసీ-2, బీసీ(ఎ)-1), సీనియర్ రెసిడెంట్స్ (రేడియాలజీ, స్త్రీలు) 2 (ఓసీ-1, ఎస్సీ-1), డ్రైవర్ (పురుషుడు) 1(ఎస్సీ), పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్లు 2 (ఓసీ పురుషుడు 1, ఎస్సీ మహిళ 1), మెడికో సోషియల్ వర్కర్(మహిళ) 1(ఎస్సీ), కార్డియో వాస్క్యులర్ టెక్నీషియన్(సీవీటీ) 2 (మహిళలు, ఓసీ-1, ఎస్టీ-1), మామోగ్రఫీ టెక్నీషియన్ 1(ఎస్సీ మహిళ) పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు స్విమ్స్ డైరెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించే ఇంటర్వ్యూలకు ఒరిజినల్, జెరాక్స్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాలకు స్విమ్స్ వెబ్‌సైట్‌ను చూడాలని పేర్కొన్నారు.

తిరుమల మొదటి ఘాట్‌లో ప్రమాదం

- ఒకదాన్నొకటి ఢీకొన్న మూడు కార్లు



తిరుమల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో శుక్రవారం మూడు కార్లు ఒకదాన్ని ఒకటి ఢీకొన్నాయి. 18వ మలుపు వద్ద తమిళనాడు భక్తులు తమ కారుకు సడన్ బ్రేక్‌లు వేశారు. వెనుకే వచ్చిన తమిళనాడు, కర్ణాటక కార్లు ఒకదాన్ని ఒకటి ఢీకొన్నాయి. కార్ల ముందు భాగాలు కొంతమేరకు ధ్వంసమైనప్పటికీ భక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

కార్మిక సంఘాల భారీ ర్యాలీ





ర్యాలీగా వస్తున్న కార్మిక సంఘాల నాయకులు - పూర్ణకుంభం సర్కిల్ వద్ద బైఠాయించిన నేతలు

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 16 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన గ్రామీణ భారత్ బంద్‌లో భాగంగా నగరంలో భారీ ర్యాలీ నిర్వహించాయి. సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ నగర కార్యదర్శులు వేణుగోపాల్, ఎన్.డి.రవి, విజయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పూర్ణకుంభం సర్కిల్ వద్ద సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి మాట్లాడుతూ కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీల పట్ల ప్రధాని మోదీ అన్యాయంగా ప్రవర్తిస్తున్నారని, గ్రామీణ భారతం నిర్వీర్యం అయిపోయిందని విమర్శించారు. అప్పుల కుంపటిగా మారిన దేశంలో ఆదానీ, అంబానీల రాజ్యం సాగుతోందని దుయ్యబట్టారు. రామమందిరం పేరిట ప్రజా సమస్యలను పక్కదారి పట్టించి, మతోన్మాద చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. సీఎం జగన్, ప్రతిపక్ష నేత చంద్రబాబు, పవన్‌కల్యాణ్ రాష్ట్రానికి బీజేపీ చేసిన ద్రోహాన్ని పట్టించుకోకుండా ఆ పార్టీతో అంటకాగడం అన్యాయమన్నారు. ప్రజా ప్రయోజనాల కంటే అధికారంలో కొనసాగడమే పరమావధిగా టీడీపీ, వైసీపీ, జనసేన భావిస్తున్నాయని విమర్శించారు. కరకంబాడిలో పేదలకు ఇళ్లస్థలాలపై సాగుతున్న పోరాటాన్ని కార్మిక సంఘాలు బలపరుస్తున్నాయని ప్రకటించారు. ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు రాధాకృష్ణ, సుబ్రహ్మణ్యం, సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు వందవాసి నాగరాజు, పి.మురళి మద్దతు ప్రకటించారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.హేమలత, రాష్ట్ర కార్యదర్శి ఎ.రామానాయుడు మాట్లాడుతూ పది రోజుల్లో సమస్య పరిష్కరించకుంటే శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. అంతకుముందు పూర్ణకుంభం సర్కిల్‌కు వేలాది మంది కార్మికులు చేరుకోవడంతో ఎర్రజెండాలతో రెపరెపలాడింది. ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కొంతసమయం ట్రాఫిక్ స్తంభించింది. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు హరి, రాజా, శివానందం, సత్యశ్రీ, సెల్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మేము దాచుకున్న సొమ్ము తరలించే హక్కు ఎవరిచ్చారు..?

- సీఎం జగన్‌పై ఉద్యోగ సంఘాల ఆగ్రహం


కలెక్టరేట్ ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఏపీ జేఏసీ నేతలు సురేష్‌బాబు, తదితరులు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 16: జీతాలు ఒకటో తేదీన ఇవ్వాలని డిమాండ్ చేయడం చరిత్రలో ఇదే తొలిసారని, ఇది ప్రభుత్వానికి సిగ్గుచేటని ఏపీ జేఏసీ తిరుపతి చైర్మన్ సురేష్‌బాబు, కార్యదర్శి నిర్మల విమర్శించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిల చెల్లింపు, ఐఆర్ 30శాతం ఇవ్వాలన్న డిమాండ్‌తో శుక్రవారం కలెక్టరేట్ వద్ద భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పట్ల నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందన్నారు. ఉద్యోగులు దాచుకున్న జీపీఎఫ్, ఏపీ జీఎల్ఐ లాంటి బిల్లులు చెల్లించకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము దాచుకున్న సొమ్ము తరలించే హక్కు ప్రభుత్వానికి లేదన్నారు. ఈ ఐదేళ్లలో ఒక డీఏ ఇచ్చిన ఏకైక ప్రభుత్వం ఇదేనని, ఇలాంటి ప్రభుత్వాన్ని ఇక ముందు కూడా చూడలేమని విమర్శించారు. సీపీఎస్ విధానాన్ని వారంలో రద్దు చేస్తానని హామీ ఇచ్చి గాలికి వదిలేసిన ఘనత జగన్ ప్రభుత్వం దక్కించుకుందన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణపై జీవో విడుదల చేసినా అమలు పరచకుండా కాలయాపన చేస్తోందని, తక్షణమే వారిని రెగ్యులర్ చేయాలని కోరారు. పెరిగిన ధరలననుసరించి 30శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిబాబు, శ్రీనివాసులు, హిమగిరి, పద్మజ, రవిశంకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, జగన్నాథం, వెంకటముని, రమణారెడ్డి, మునికేశవులు, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

రాజధాని ఫైల్స్ ప్రదర్శనను అడ్డుకోవడం అన్యాయం : టీడీపీ





ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతున్న నరసింహయాదవ్, సుగుణమ్మ

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 16: రాజధాని ఫైల్స్ సినిమా ప్రదర్శనను అడ్డుకోవడం అన్యాయమని టీడీపీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహయాదవ్, మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుగుణమ్మ అన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో వారు వేర్వేరుగా మాట్లాడుతూ 60 రోజుల్లో వైసీపీ ప్రభుత్వం కూలడానికి సిద్ధంగా ఉందన్నారు. రైతు సమస్యలపై తీసిన రాజధాని చిత్రాన్ని ప్రదర్శించనివ్వకుండా పోలీసులు, రెవెన్యూ అధికారులు థియేటర్ల వద్ద విధ్వంసకాండ సృష్టించడం సబబు కాదన్నారు. న్యాయస్థానం కూడా ఈ సినిమా ప్రదర్శనకు బాసటగా నిలిచిందన్నారు. అమరావతి రాజధాని నిర్మాణం కోసం రైతులందరూ స్వచ్ఛందంగా భూములు ఇచ్చారని గుర్తు చేశారు. అభివృద్ధి చేయాల్సిన వైసీపీ ప్రభుత్వం అవినీతి, అక్రమాలకు పాల్పడడం బాధాకరమన్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఆర్‌సీ మునికృష్ణ, ఊకా విజయకుమార్, దంపూరి భాస్కర్, శ్రీధర్‌వర్మ, ఊట్ల సురేంద్రనాయుడు, మునిశేఖర్‌రాయల్, శాంతమ్మ, పుష్పవతి తదితరులు పాల్గొన్నారు.

బస్టాండులో సొంత ప్రచారం


బెంగళూరు ప్లాట్‌ఫాం వద్ద బ్యానర్లు



తిరుపతి డిపో ప్రధాన గేటు ముందు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 16 : ఆర్టీసీ సెంట్రల్ బస్టేషన్‌లో సెల్ఫ్ ప్రచారానికి అడ్డుఅదుపులేకుండా పోతోంది. సాధారణంగా బస్టాండులో సంస్థకు ఆదాయం చేకూర్చే కమర్షియల్ బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుంటారు. కానీ ఇక్కడ అలాంటి వాటికి అవకాశమివ్వకుండా ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నాయకులు నిబంధనలకు విరుద్ధంగా పోటీపడి బ్యానర్లు ఏర్పాటు చేస్తుండడం చర్చనీయాంశంగా మారింది. గతంలో పర్వదినాలు, ఉద్యోగ విరమణ, కొత్తగా పదవి లభించిన సందర్భంగా ఒకటి రెండు రోజులు బ్యానర్లు ఏర్పాటు చేసి, మళ్లీ తొలగించేవారు. ప్రస్తుతం కొత్త సంవత్సరం, సంక్రాంతి, జనవరి నెలాంతంలో ఉద్యోగ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన బ్యానర్లు ఇంకా అలాగే ఉన్నాయి. దీంతో బ్యానర్ల ప్రదర్శన టెండరు దక్కించుకున్న వ్యక్తి వీటిపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఉన్నతాధికారులు స్పందించి, ఉచిత బ్యానర్లను వెంటనే తొలగించేలా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రాయలవారికి ఘన నివాళి



తిరుపతి, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయల జయంతి సందర్భంగా మున్సిపల్ పార్కులోని ఆయన విగ్రహానికి స్థానిక బలిజ, కాపు సోదరులు ఘనంగా నివాళులర్పించారు. గజమాల వేసి జయహో రాయల్ అంటూ ఆయన కీర్తిని కొనియాడారు. టీడీపీ సీనియర్ నేత, కాపు సంఘ నాయకుడు ఊకా విజయకుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పెద్దఎత్తున బలిజ నాయకులు పాల్గొన్నారు.

ఖాట్మండు వర్సిటీతో పద్మావతి వర్సిటీ ఒప్పందం

- బోధన, పరిశోధనల్లో పరస్పర సహకారం


ఒప్పంద పత్రాన్ని చూపుతున్న వీసీ భారతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 16: నేపాల్‌లోని ఖాట్మండు యూనివర్సిటీతో పద్మావతి మహిళా యూనివర్సిటీ అవగాహనా ఒప్పందం చేసుకుంది. ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకూ ఖాట్మండు యూనివర్సిటీలో నిర్వహించిన సదస్సుకు పద్మావతి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ దేవూరు భారతి హాజరయ్యారు. ఖాట్మండు యూనివర్సిటీతో ఒప్పంద పత్రాలపై ఆమె సంతకాలు చేశారు. బోధన, పరిశోధన అంశాల్లో పరస్పరం సహకరించుకోనున్నట్టు చెప్పారు. భారతిని ఖాట్మండు యూనివర్సిటీ వీసీ బోలా తప, రిజిస్ట్రార్ అచ్యుత్ వాంగ్లే సత్కరించారు.

కృష్ణదేవరాయల విగ్రహం పునఃప్రతిష్ఠ



తిరుపతి, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి) : తిరుపతి లీలామహల్ సర్కిల్లో పునఃప్రతిష్ఠించిన శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని శుక్రవారం టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ ఆవిష్కరించారు. కృష్ణదేవరాయుల పాలన ఆదర్శమని చెప్పారు. తిరుమల శ్రీవారిని ఏడుసార్లు దర్శించుకుని, విలువైన ఆభరణాలను అందజేసిన గొప్ప చక్రవర్తి అని కొనియాడారు. ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం అదృష్టంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పొన్నాల చంద్ర, ఆనీష్ రాయల్, వరికుంట్ల నారాయణ, దూది కుమారి, మునిరామిరెడ్డి, పైడి సునీత, నాయకులు నీలం బాలాజీ, బాలిశెట్టి కిషోర్, మద్దాలి శేఖర్, అనిల్ రాయల్, విజయలక్ష్మి, గల్లా కవిత, బెల్లం రమేష్, గ్రంథాలయ చైర్మన్ మధుబాల పాల్గొన్నారు.

10 కిలోల గంజాయి స్వాధీనం


గంజాయి, నిందితులతో ఎస్‌ఈబీ అధికారులు

గూడూరు, ఫిబ్రవరి 16: పది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఈబీ సీఐ రమేష్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎస్‌ఈబీ కార్యాలయంలో మీడియాకు వివరాలు వెల్లడించారు. చిల్లకూరు మండలం బూదనం టోల్‌ప్లాజా సమీపంలో వాహనాలను తనిఖీ చేసేందుకు ఎస్‌ఈబీ సిబ్బంది వెళుతుండగా ఇద్దరు వ్యక్తులు రోడ్డుపై బ్యాగులతో అనుమానాస్పదంగా ఉండడంతో వారిని తనిఖీ చేశారు. బ్యాగుల్లో 10 కేజీ గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితులిద్దరూ తమిళనాడు రాష్ట్రం తిరవళ్లూరు ప్రాంతానికి చెందిన సంజయ్‌కుమార్, ముల్లైకారైపట్టి ప్రాంతానికి చెందిన ఆకాష్ అని తెలిపింది. వీరు అనకాపల్లి జిల్లాలో గంజాయి కొనుగోలు చేసి చెన్నైకు తరలించి విక్రయిస్తుంటారని విచారణలో తేలింది. ఈ తనిఖీల్లో ఎస్‌ఐ మోసెస్, సిబ్బంది కిరణ్‌సింగ్, రమేష్, ప్రసాద్, కృష్ణయ్య, గౌస్‌బాషా, ఆనంద్‌బాబు, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

భర్తే చంపేశాడంటూ బంధువుల ఫిర్యాదు


శైలజ మృతదేహం

కోట, ఫిబ్రవరి 16: అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందిన ఘటన కోట మండలం విద్యానగర్‌లో జరిగింది. మండల పరిధిలోని వెంకన్నపాళెం గ్రామానికి చెందిన సూళ్లూరు మహేష్, శైలజ(30) విద్యానగర్‌లోని ఓ రైతుకు చెందిన పొలాన్ని లీజుకు తీసుకొని కూరగాయలు సాగుచేస్తున్నారు. భార్య, భర్తలు ఇద్దరూ గురువారం సాయంత్రం వరకు కూరగాయల తోటలో పనులు చేసుకుంటూ ఉన్నారు. ఆ తరువాత ఏమైందో గానీ తన భార్య కన్పించడం లేదని భర్త మహేష్ వెంకన్నపాళెం, తిన్నెలపూడి గ్రామాల్లో చెప్పడంతో స్థానికులు తెల్లవారుజాము వరకు గాలించినా శైలజ జాడ దొరకలేదు. చివరగా నేలబావి గట్టుమీద శైలజ తలకు చుట్టుకొని ఉన్న టవలు కన్పించడంతో గ్రామస్తులు బావిలో దూకి పరిశీలించగా మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని బయటకుతీసి వెంకన్నపాళెం గ్రామానికి తీసుకువచ్చారు. కాగా, భర్త మహేష్ తమ బిడ్డను చంపేసి, బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లుగా చిత్రీకరిస్తున్నాడని శైజల బంధువులు ఎస్‌ఐ నాగబాబుకు ఫిర్యాదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగన్ కోసం వలంటీర్లు పనిచేయాలి: కిలివేటి


వలంటీర్లనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలివేటి

ఓజిలి, ఫిబ్రవరి 16: ఇప్పటి వరకు పింఛన్లు అందించారు... పార్టీ ఆదేశించిన కార్యక్రమాలన్నింటిలో పరోక్షంగా పాల్గొని అన్నీ చేశారు... మీకు నిర్దేశించిన ప్రాంతంలో వైసీపీ నాయకులకంటే మీరే ప్రజలనుంచి గౌరవం అందుకున్నారు... మీకు ఇస్తున్న జీతం(గౌరవవేతనం) కొంచమే... అయినా మీకు ఈ పనులతో ఆత్మసంతృప్తి కలిగివుంటుంది... ఇకనుంచి మీరు జగనన్న కోసం పనిచేయాలి... జగనన్న గెలుపుమీదనే పెట్టాలి... జగనన్న గెలవకపోతే మీ ఉద్యోగాలు ఊడతాయి... అంటూ సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య వలంటీర్లకు హితబోధ చేశారు. ఓజిలి మండల కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఎంపీడీవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో వలంటీర్ల అభినందన సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే ప్రజలకు మంచి జరగదని, పథకాలన్నీ ఆగిపోతాయని ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని వలంటీర్లకు సూచించారు. అనంతరం వలంటీర్లకు సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర అవార్డులతో పాటు ప్రశంసాపత్రాలను ఎమ్మెల్యే కిలివేటి అందజేశారు. కాగా, సగం మంది వలంటీర్లు కూడా కార్యక్రమంలో పాల్గొనకపోవడాన్ని ఆరిమేనిపాడు ఎంపీటీసీ సభ్యుడు రఘురామరాజు సభావేదిక నుంచే ప్రస్తావించడం గమనార్హం.

నాయుడుపేట: పట్టణంలోని కేకే కల్యాణ సదన్‌లో వలంటీర్లకు పురస్కారాలు ప్రదానం చేశారు. మున్సిపాలిటీ పరిధిలో 221మంది వలంటీర్లు ఉండగా ఐదుగురికి సేవారత్న, 197 మందికి సేవామిత్ర, మండల పరిధిలో ఐదుగురికి సేవారత్న, 192 మందికి సేవామిత్ర పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రేమ్‌రాజ్‌కుమార్, కటకం జయరామ్, చదలవాడ కుమార్, కిషోర్‌యాదవ్, చెంచయ్య, కరుణాకర్‌రెడ్డి, రత్నశ్రీ, కౌన్సిలర్లు దారా రవి, షబ్బీర్, సాధు శాంతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.03 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.03 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం లెక్కించి శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక, గురువారం 45,825 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 21,380 మంది తలనీలాలు సమర్పించారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

ఇద్దరు బైండోవర్

కోట, ఫిబ్రవరి 16: బెల్టు దుకాణాలు నడుపుతున్న ఇద్దరిని ఎస్‌ఈబీ అధికారులు రెవెన్యూ కార్యాలయంలో బైండోవర్ చేశారు. వీరారెడ్డిసత్రం, తిన్నెలపూడి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మద్యం బెల్టు దుకాణాలు నడుపుతుండడంతో కేసులు నమోదు చేసి డిప్యూటీ తహసీల్దారు మల్లికార్జున్‌రావు బైండోవర్ చేశారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు

బాలాయపల్లి, ఫిబ్రవరి 16: తొట్టంబేడు మండలంలోని కాసరం పంచాయతీ కొండరాజుపల్లికి చెందిన దీపిక గూడూరు పట్టణంలోని డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో డిగ్రీ చదువుతుంది. కళాశాలకు వెళ్లేందుకు రెండ్రోజుల క్రితం బాలాయపల్లి మండలంలోని మేల్చూరు వద్ద బస్సు ఎక్కింది. సాయంత్రం ఇంటికి రాకపోవడంతో విద్యార్థిని తండ్రి మురళీ నాయుడు కళాశాలలో విచారించారు. కళాశాలకు కూడా రాలేదని తెలియడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహబూబ్ సుభానీ తెలిపారు.

డిగ్రీ కళాశాలకు నాక్ ఏ గ్రేడ్

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 16: సూళ్లూరుపేటలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాక్ ఏ గ్రేడ్ దక్కిందని ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బి శంకర్ శర్మ తెలిపారు. కళాశాలలో అదనపు కోర్సులు, బోధనా పద్ధతులు, నాణ్యత ప్రమాణాలను పరిశీలించిన నాక్ బృందం ఏ గ్రేడ్ ప్రకటించిందని పేర్కొన్నారు. శుక్రవారం కళాశాల అధ్యాపక బృందాన్ని ప్రిన్సిపాల్ అభినందించారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ డాక్టర్ రాజా, వైస్ ప్రిన్సిపాల్ విక్టోరియా రాణి పాల్గొన్నారు.

కౌమారదశపై అవగాహన

కోట, ఫిబ్రవరి 16: కోటలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో బాలికలకు కౌమార దశపై ఐసీడీఎస్ అధికారులు శుక్రవారం అవగాహన కల్పించారు. సీడీపీవో మునికుమారి, సూపర్‌వైజర్లు కృష్ణమ్మ, అంగన్వాడీ వర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మళ్లీ తెరపైకి..
టైగర్ రొయ్య

- క్రమంగా పెరుగుతున్న ధరలు
- ఆక్వా రైతుల్లో చిగురిస్తున్న ఆశలు


కోట మండలం గోవిందపల్లిలో సాగులో ఉన్న టైగర్ రొయ్యలు

కోట, ఫిబ్రవరి 16: సముద్రతీర ప్రాంత మండలాలైన కోట, చిల్లకూరు, వాకాడు, చిట్టమూరుల్లోని రైతులకు రెండున్నర దశాబ్దాల క్రితం టైగర్ రొయ్యలు పరిచయమయ్యాయి. సన్నకారు రైతులు సైతం కోట్లకు పడలెత్తేలా చేశాయి. ఆ తర్వాత వెనామీ రొయ్యల సునామీలో టైగర్ సాగును పూర్తిగా మరచిపోయారు. ఇటీవల సంభవించిన మిచాంగ్ తుపాన్‌తో లక్షల రూపాయల విలువచేసే రొయ్యలు కళ్లముందే సముద్రం పాలయ్యాయి. ఈ కష్టం నుంచి ఆక్వా రైతులు ఇంకా తేరుకోలేదు. ఈ పరిస్థితుల్లో కొంతమంది రైతులు నాలుగు సముద్ర తీర మండలాల్లో కేవలం రెండువేల ఎకరాల్లోపే సాగు చేశారు. ప్రస్తుతం ధరలు ఆశాజనకంగా ఉండటంతో మిగిలినవారూ ఈ సాగుపై మక్కువ చూపుతున్నారు.


కాటా వేస్తున్న వెనామీ రొయ్యలు

ధరలిలా..

టైగర్ రొయ్య 20 కౌంట్ గతంలో రూ.410 ఉండగా, ప్రస్తుతం రూ.510 చేరింది. 30 కౌంట్ రూ.360 నుంచి రూ.400కి, 40 కౌంట్ రూ.295 నుంచి రూ.300 వరకు పెరిగింది. నాలుగురోజుల నుంచి ధరలు పెరుగుతుండటంతో మిగిలినవారూ టైగర్ సాగుపై దృష్టి పెడుతున్నారు.

పడిపోతున్న 'వెనామీ' ధరలు

తైవాన్, ఇండోనేషియా, అమెరికా, యూరప్ దేశాల్లో వెనామి రొయ్యలకు డిమాండ్ పడిపోయిందంటూ ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో వీటి ధరలు పడిపోతున్నాయి. 30 కౌంట్ ఉన్న వెనామీ రొయ్యలు రూ.440, 40 కౌంట్ ఉన్నవి రూ.390, 50 కౌంట్ ఉన్నవి రూ.340, 60కౌంట్ ఉన్న రొయ్యలు రూ.300గా ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


టైగర్ రొయ్యలు

మండల సమావేశానికి ప్రజాప్రతినిధుల డుమ్మా


ప్రజాప్రతినిధులు రాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

చిల్లకూరు, ఫిబ్రవరి 16: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరగాల్సిన సర్వసభ్య సమావేశానికి ప్రజాప్రతినిధులందరూ డుమ్మా కొట్టారు. కోరం లేకపోవడంతో సమావేశం నిలిచిపోయింది. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రమణమూర్తిరావు ప్రజాప్రతినిధులందరికీ ముందు రోజే సమాచారం ఇచ్చారు. అలాగే అధికారులకు కూడా తెలియజేశారు. అయితే ఎంపీపీ, ఒక ఎంపీటీసీ, ఇద్దరు సర్పంచులు మాత్రమే హాజరయ్యారు. జడ్పీటీసీ, వైస్ ఎంపీపీలతో పాటు మిగిలిన ఎంపీటీసీలు, సర్పంచులు ఎవరూ సమావేశానికి రాలేదు. మధ్యాహ్నం ఒంటి గంట దాటినా ప్రజాప్రతినిధులు రాకపోవడంతో అధికారులు వారికి ఫోన్ చేసినా స్పందించలేదు. దీంతో అధికారులు వెళ్లిపోయారు. సమావేశానికి గైర్హాజరైన జడ్పీటీసీని వివరణ కోరగా సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తే సమస్యలను పరిష్కరించడంలేదని, అలాంటప్పుడు సమావేశాలకు వెళ్లినా ఉపయోగం ఉండదన్న ఉద్దేశ్యంతో తాను హాజరుకాలేదన్నారు. అలాగే పలువురు ఎంపీటీలతో మాట్లాడినా చెప్పిన సమస్యలు పరిష్కారం కావడంలేదని, అందుకే సమావేశానికి వెళ్లలేదని చెప్పారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ మండల సమావేశానికి ప్రజాప్రతినిధులు హాజరుకాకపోవడం అధికార పార్టీలో అచర్చనీయాంశం అయింది.

'రాజధాని ఫైల్స్'పై జగన్‌కు ఉలుకెందుకు: కురుగొండ్ల


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, ఫిబ్రవరి 16: 'రాజధాని ఫైల్స్' సినిమా విడుదలైతే జగన్ ఎందుకు ఉలిక్కిపడుతున్నారని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ప్రశ్నించారు. శుక్రవారం ఆయన తన నివాసంలోని టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఇటీవల యాత్ర-2 సినిమా విడుదలైతే సీఎం జగన్ ఉచితంగా టికెట్లు బుక్ చేసి మరీ జనానికి చూపించారని తెలిపారు. రాజధాని రైతుల కష్టాలను వివరిస్తూ తీసిన సినిమా విడుదలైతే ఆపించేయడం అన్యామన్నారు. జగన్‌కు ఓటమి భయం పట్టుకుందని, అందువల్లే ప్రతిదీ తనకు వ్యతిరేకంగా ఉంటుందని కంగారు పడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న జగన్‌ను ప్రజలు ఇంటికి పంపడం ఖాయమన్నారు. ఇక ఆల్తూరుపాడు రిజర్వాయరును ఎనిమిది నెలల్లో పూర్తి చేస్తామని సీఎం వెంకటగిరి సభలో చెప్పి వెళ్లారని, కానీ నేటికి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని విమర్శించారు. అల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణం ఎందుకు మొదలు పెట్టలేదని సీఎంను అడిగే ధైర్యం రాంకుమార్ రెడ్డి లేదన్నారు. కార్యక్రమంలో వెంకటగిరి ఏఎంసీ మాజీ చైర్మన్ పులలికోల్లు రాజేశ్వరరావు, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీకే ప్రసాద్ నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పప్పు చంద్రమౌళి రెడ్డి, అవ్వారు సత్యం, గల్లా శ్రీనివాసులు నాయుడు, కాపా శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

20న ఐటీఐలో ఉద్యోగమేళా

తిరుపతి(విద్య), ఫిబ్రవరి16: పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 20న ఉదయం 10గంటలకు ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జూనియర్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఎస్.వెంకటరమణ పేర్కొన్నారు. అపోలో ఫార్మసీ, బ్లిస్ సంస్థలలో రిటైల్ ట్రైనీ, ఫార్మసిస్ట్, ఎలక్ట్రీషియన్ ఉద్యోగాల కోసం ఈమేళా నిర్వహిస్తున్నామని, పదవ తరగతి నుంచి డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, ఫార్మసీ కోర్సులు చదివిన వారు అర్హులని తెలిపారు. వయసు 18-30లోపు ఉండాలని, ఎంపికైన వారికి నెలకు రూ.13,500-20వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు. ఇతర వివరాల కోసం 639429950ను సంప్రదించాలని కోరారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 16: జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా విజయవాడ నుంచి శుక్రవారం రాత్రి వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి ఎస్పీ మలిక గర్గ్, జేసీ శుభం బన్సల్, అదనపు ఎస్పీ వెంకట్రావుతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద తీసుకుంటున్న చర్యలను వివరించారు. జిల్లాలో ఫారం 6, 7, 8 అంశాలపైనా వివరాలు తెలిపారు. డీఆర్వో పెంచలకిషోర్, ఎస్డీసీలు కోదండరామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు పావని, ఆశా, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుమల మొదటి ఘాట్‌లో ప్రమాదం

తిరుమల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో శుక్రవారం మూడు కార్లు ఒకదాన్ని ఒకటి ఢీకొన్నాయి. 18వ మలుపు వద్ద తమిళనాడు భక్తులు తమ కారుకు సడన్ బ్రేక్‌లు వేశారు. వెనుకే వచ్చిన తమిళనాడు, కర్ణాటక కార్లు ఒకదాన్ని ఒకటి ఢీకొన్నాయి. కార్ల ముందు భాగాలు కొంతమేరకు ధ్వంసమైనప్పటికీ భక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

స్కూల్ బస్సును ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

పలువురు విద్యార్థులకు గాయాలు


గాయపడిన విద్యార్థిని

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 16: సూళ్లూరుపేట పట్టణంలో అయ్యప్ప స్వామి ఆలయం వద్ద శుక్రవారం పాఠశాల బస్సును ట్రావెల్స్ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలు కాగా మరో నలుగురి స్వల్ప గాయాలయ్యాయి. సూళ్లూరుపేట నుంచి శ్రీసిటీలో ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాలకు విద్యార్థులను తీసుకెళ్తున్న బస్సును ఎదురుగా వస్తున్న ట్రావెల్స్ బస్సు ఢీకొంది. పాఠశాల బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థులు ప్రణతి, విశిష్ట తీవ్రంగా గాయపడ్డారు. మరో నలుగురికి తేలికపాటి గాయాలయ్యాయి. క్షతగాత్రులను షార్ ఉద్యోగుల కాలనీలో ఉన్న సతీష్ ధావన్ మెమోరియల్ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం చెన్నైకి తీసుకెళ్లారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 35మంది విద్యార్థులు ఉన్నారు. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగపోవడంతో ఊపిరిపీల్చుకొన్నారు. ఎస్‌ఐ రహీంరెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని విచారించారు. రవాణా శాఖ అధికారి అనిల్‌కుమార్ ప్రమాదానికి గురైన బస్సును పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులు క్రమశిక్షణతో మెలగాలి

వెంకటగిరిటౌన్, ఫిబ్రవరి 16: పోలీసులు క్రమశిక్షణతో మెలగాలని డీఐజీ రాజకుమారి అన్నారు. మండల పరిధిలోని 9వ బెటాలియన్‌లో రెండు రోజులుగా ఆమె తనిఖీలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం బెటాలియన్ పరిసర ప్రాంతాలు, స్టోర్, పాఠశాల, పెరేడ్ మైదానాన్ని పరిశీలించారు. అనంతరం డీఐజీ మాట్లాడుతూ పోలీసులు విధి నిర్వహణలో ప్రాణాల సైతం పణంగా పెట్టి పోరాడాలని సూచించారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో ముచ్చటించారు. వారిని ఉద్దేశించి మాట్లాడుతూ విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కమాండెంట్ ప్రకాష్, అడిషనల్ కమాండెంట్ అరుణ్ బోస్, అసిస్టెంట్ కమాండెంట్ మనోహర్, ఆనంద్ కన్నా, రామకృష్ణ, చంద్రమౌళి, శేషమ్మ, కిరణ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్విమ్స్‌లో పోస్టులకు 22న వాక్‌ఇన్ ఇంటర్వ్యూలు

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 16: స్విమ్స్ పరిధిలోని శ్రీబాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ(బీఐఓ) ద్వారా క్యాన్సర్ స్ర్కీనింగ్ నిర్వహణ కోసం డాక్టర్లు, సిబ్బంది నియామకాల కోసం ఈనెల 22న వాక్‌ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ అపర్ణబిట్ల శుక్రవారం తెలిపారు. మెడికల్ ఆఫీసర్లు 3 (ఓసీ-2, బీసీ(ఎ)-1), సీనియర్ రెసిడెంట్స్ (రేడియాలజీ, స్త్రీలు) 2 (ఓసీ-1, ఎస్సీ-1), డ్రైవర్ (పురుషుడు) 1(ఎస్సీ), పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్లు 2 (ఓసీ పురుషుడు 1, ఎస్సీ మహిళ 1), మెడికో సోషియల్ వర్కర్(మహిళ) 1(ఎస్సీ), కార్డియో వాస్క్యులర్ టెక్నీషియన్(సీవీటీ) 2 (మహిళలు, ఓసీ-1, ఎస్టీ-1), మామోగ్రఫీ టెక్నీషియన్ 1(ఎస్సీ మహిళ) పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10గంటలకు స్విమ్స్ డైరెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించే ఇంటర్వ్యూలకు ఒరిజినల్, జెరాక్స్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాలకు స్విమ్స్ వెబ్‌సైట్‌ను చూడాలని పేర్కొన్నారు.

సప్త వాహనాలపై ఊరేగిన కల్యాణవెంకన్న



నారాయణవనం, ఫిబ్రవరి 16: సూర్య జయంతిని పురస్కరించుకుని శుక్రవారం కల్యాణ వెంకటేశ్వరస్వామి సప్త వాహనాలను అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం సుప్రబాతసేవ నిర్వహించి నిత్య పూజా కైంకర్యాలు చేపట్టారు. 6.30 గంటలకు సూర్యభగవానుడిని వాహనంగా చేసుకుని కళ్యాణ వెంకన్నను పురువీధులలో ఊరేగించారు. అనంతరం ఆలయానికి చేరుకున్న వెంకన్న హంస, చిన్నశేష, కల్పవృక్ష వాహనాలలో ఊరేగించారు. శ్రీదేవి, భూదేవి సమేత స్వామి పెద్దశేష వాహనంపై, మధ్యాహ్నం తిరుచ్చి వాహనం అధిరోహించి మాడ వీధుల్లో విహరించారు. సాయంత్రం 7 గంటలకు చంద్రప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

తిరుచ్చి వాహనసేవలో అభయ హస్తాధీశుడు



వడమాలపేట, ఫిబ్రవరి 16: మండల పరిధిలోని అప్పలాయగుంటలో వెలసిన ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో రథసప్తమి సందర్భంగా శుక్రవారం ఉదయం తిరుచ్చి వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వేకుజామున సుప్రబాతసేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. అనంతరం ఉభయదేవేరులతో స్వామివారు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తుల నీరాజనాలు అందుకున్నారు. లయం ఎదుట సూర్యనారాయణ స్వామికి అర్చకులు మంగళ హారుతులిచ్చి సూర్య నమస్కారం చేశారు. మాడ వీధుల్లో విహరిస్తున్న స్వామివారిని భక్తులు నారికేల, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

రైతు భరోసా, వెల్‌నెస్ కేంద్రాల ప్రారంభం

పుత్తూరు, ఫిబ్రవరి 16: పుత్తూరు మండలం గోపాలక్ష్మాపురం ఎస్టీ కాలనీలో రూ.44.24 లక్షలతో నిర్మించిన రైతు భరోసా, వెల్‌నెస్ కేంద్రాలను శుక్రవారం మంత్రి రోజా ప్రారంభించారు. ఈ భవనాల వద్ద నిర్మించిన వైఎస్సార్ విఈ కార్యక్రమంలో ఎంపీపీ మునివేలు, వైసీపీ నాయకులు బత్తయ్య, గోవిందస్వామిరెడ్డి, భాస్కరయాదవ్, జయప్రకాష్, మునస్వామిరెడ్డి పాల్గొన్నారు.

బంద్‌ను విజయవంతం చేద్దాం



ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘం నాయకులు

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 16: ఢిల్లీ సరిహద్దులో రైతులు చేస్తున్న ఉద్యమానికి మద్దతుగా శనివారం నిర్వహించే గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐయూటీయూసీ జిల్లా నాయకుడు కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కార్మిక సంఘాల నాయకులతో పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో సమాచార హక్కుల వేదిక, ఏఐయూటీయూసీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఏఐయూటీయూసీ నాయకులు అజీజ్ బాషా, మునేంద్ర, జబ్బర్, సమాచార హక్కుల వేదిక కార్యదర్శి మురగారెడ్డి, వెంకటరత్నం, పొన్న రంగం, శివ, హేమలత తదితరులు పాల్గొన్నారు.

'రాజధాని ఫైల్స్' సినిమాతో జగన్‌కు వణుకు: భానుప్రకాష్


మీడియాతో మాట్లాడుతున్న భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 16: రాజధాని ఫైల్స్ సినిమా ట్రైలర్‌ను తలుచుకుంటేనే సీఎం జగన్ వెన్నులో వణుకు పుడుతోందని టీడీపీ నగరి నియోజకవర్గ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ ఎద్దేవా చేశారు. శుక్రవారం పుత్తూరులో విలేకరులతో మాట్లాడుతూ ఒక్క రాజధాని నిర్మాణమే చేతగాని దద్దమ్మ ప్రభుత్వం మూడు రాజధానులు నిర్మిస్తామని చెప్పడం ఉట్టికి ఎగరలేనమ్మ స్వర్గానికి ఎగరతానని చెప్పిన చందాన ఉందని దెబ్బిపొడిచారు. రాష్ట్ర విశాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని స్వచ్ఛందంగా తమ పొలాలను ప్రభుత్వానికి అప్పగించిన పాపానికి అమరావతి రైతులను నాలుగేళ్లుగా వేధించిన తీరు, వారిపై జరిపిన దౌర్జన్యకాండ, పోలీసులతో పెట్టించిన కేసులు రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ గుర్తు ఉందని స్పష్టం చేశారు. ఈ అంశాలనే ప్రాతిపదికగా తీసుకుని రాజధాని ఫైల్స్ పేరుతో సినిమా తీస్తే జగన్‌కు ఉలుకెందుకని విమర్శించారు. నియోజకవర్గ వ్యాప్తంగా మళ్లీ విద్యుత్ కోతలు మొదలవ్వడంపై ఆయన విరుచుకుపడ్డారు. తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజల నడ్డివిరిచిన జగన్ సర్కార్ కనీసం కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయడంలో విఫలమవ్వడం వారి చేతగాని పాలనకు నిదర్శనమని తేల్చి చెప్పారు. విద్యార్థులకు పరీక్షల సీజన్, రైతులకు పంటలు చేతికొచ్చే సమయంలో ఎడాపెడా విద్యుత్ కోతలు విధించడాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. ఇప్పటికే రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి దివాళా ఆంధ్రప్రదేశ్ చేసిన సీఎం జగన్, విద్యుత్ కోతలతో అంధకార ఆంధ్రప్రదేశ్‌గా మార్చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రాన్ని, రాష్ట్ర ప్రజల భవిష్యత్తును సర్వనాశనం చేసిన జగన్ కథ, వైసీపీ ఉనికి ముగియనుందని స్పష్టం చేశారు. సమావేశంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య, అధికార ప్రతినిధి చినబాబు, పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, ప్రధాన కార్యదర్శి ఎస్ఎన్ ధనపాల్ పాల్గొన్నారు. అలాగే మండల పరిధిలోని వేపగుంట, పరమేశ్వరమంగళం పంచాయతీల్లో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి గంజి మాధవయ్య ఆధ్వర్యంలో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ, మీతో మీ తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని, తనను ఆశీర్వదించాలని, ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని భానుప్రకాష్ చెప్పారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు రవికుమార్, ప్రధాన కార్యదర్శి బాలాజీ, భూపాల్, కవిత, శేఖర్, పరమేశ్వరమంగళం పంచాయతీ నాయకులు సుధాకర్‌నాయుడు, మాజీ సర్పంచ్ జయశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్షాలు

కదం తొక్కిన కార్మికలోకం

పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 16: కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పుత్తూరులో భారీ ప్రదర్శన నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్ నుంచి పెట్రోల్ బంక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు సీపీఎం జిల్లా నాయకుడు వెంకటేష్, సీపీఐ మహేష్ మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు అలాగే కార్మికులందరికీ రూ.26 వేలు వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు గోపి, కృష్ణారెడ్డి, రమేష్, హరి, భాస్కర్, సీఐటీయూ నాయకులు విజయ్, పురుషోత్తం,రమేష్, శివ, వెంకటేష్ పాల్గొన్నారు.

కూల్చివేతల ప్రభుత్వం కూలిపోతుంది : టీడీపీ


కరపత్రాలు పంపిణీ చేస్తున్న హెలెన్

పిచ్చాటూరు, ఫిబ్రవరి 16: కూల్చివేతల వైసీపీ ప్రభుత్వం వచ్చే ఎన్నికలతో కూలిపోవడం ఖాయమని టీడీపీ సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జి హెలెన్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని నీరువాయిలో 'బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటువేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగలాపురం మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్, క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి, కరివర్దన్, డేవిడ్, అరుణ్‌ప్రకాష్, ఎం.ఎస్.రవి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసి చూపాం : ఎమ్మెల్యే మధు


శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి ఫిబ్రవరి16: శ్రీకాళహస్తిలో అభివృద్ధిని చేసి చూపామని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. పట్టణంలో శుక్రవారం అభివృద్ధి పనులకు శిలాఫలకాలు ఆవిష్కరించారు. ఇందులో భాగంగా చతుర్మాడ వీధుల్లో విద్యుత్తు స్తంభాల ఏర్పాటు పనులు ప్రారంభించారు. పట్టణ శివారు రాజీవ్‌నగర్ వద్ద గిరిప్రదక్షిణ మార్గంలో విడిది మండపాన్ని ప్రారంభించారు. హరహర తీర్థంలో అమ్మవారి ఆలయానికి భూమి పూజ చేశారు. ఇక స్వర్ణ ముఖి నదిపై ఆనకట్ట నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ముక్కంటి ఆలయ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు, అధికారులు పాల్గొన్నారు.

డిజిటల్ విద్యపై తమిళనాడు అధికారుల అధ్యయనం


డిజిటల్ విద్య గురించి తెలుసుకుంటున్న డాక్టర్ ఆర్తి

రేణిగుంట, ఫిబ్రవరి16: ఆంధ్రప్రదేశ్‌లో డిజిటల్ విద్యావిధానం అమలు తీరుపై శుక్రవారం రేణిగుంట జిల్లాపరిషత్ బాలికల ఉన్నతపాఠశాల ప్లస్‌లో తమిళనాడు రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ ఎం.ఆర్తి అధ్యయనం చేశారు. ఆరు నుంచి పదవతరగతి వరకు ప్రభుత్వం అమలు చేస్తున్న డిజిటల్ విద్యావిధానం, విద్యార్థుల స్పందన గురించి ప్రత్యక్షంగా పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా తెలుసుకున్నారు. ట్యాబ్‌ల వినియోగం అమ్మఒడి, జగనన్న కానుకల అమలు తీరును తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ ఎస్పీడీ కె.శ్రీనివాసులు, డీఈవో శేఖర్, ఎఎంఓ ఎస్.శివశంకర్, సీఎంఓ సురేష్, ఎంఈవో రంగనాథం, ప్రిన్స్‌పాల్ విష్ణువర్ధనం పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల రుణాలు మాఫీ చేస్తాం

తొట్టంబేడు, ఫిబ్రవరి 16: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీల రుణాలను మాఫీ చేస్తామని మాజీ ఎంపీ చింతామోహన్ అన్నారు. శ్రీకాళహస్తిలో రాళ్లుకాదు రాజధాని కావాలంటూ శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు.

పరిశోధనలతోనే దేశం అభివృద్ధి


ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ

ఏర్పేడు, ఫిబ్రవరి 16: పరిశోధనలతోనే దేశం అభివృద్ధి చెందుతుందని ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారయణ తెలియజేశారు. శుక్రవారం ఐఐటీ తిరుపతి కెమెస్ట్రీ విభాగం ఆధునిక ట్రెండ్స్ ఇన్ కెమికల్ సైన్సెస్ (ఎంటీసీఎస్-2024) అనే అంశంపై రెండురోజుల సదస్సును నిర్వహించింది. ఈ సదస్సును ఆయన ప్రారంభించారు. దేశవ్యాప్తంగా వివిధ రసాయన శాస్త్ర రంగాలకు చెందిన పలువురు ప్రముఖ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. ఐఐఎస్సీ బెంగళూరుకు చెందిన నేషనల్ సైన్స్ చైర్ ప్రొఫెసర్ బిమన్ బాగ్చి అంతరిక్ష యాత్ర గురించి ప్రసంగించారు. ఐఐఎస్సీ బెంగళూరుకు చెందిన ఇన్ఫోసిస్ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ జిముగేష్ సెల్ మెంబ్రేన్ ట్రాన్స్‌పోర్టుపై మాట్లాడారు. దేశం నలుమూలల నుంచి విద్యార్థులు విచ్చేసి వారి పరిశోధనల పోస్టర్లను ప్రదర్శించారు. ప్రొపెసర్ గౌరీ ప్రసన్న రాయ్ ప్రసంగించారు.

మత్తును తరిమి కొట్టాలి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 16: మత్తు పదార్థాలను యువత సమాజం నుంచి తరిమి కొట్టాలని జమ అతే ఇస్లామీ హింద్ తిరుపతి నగర అధ్యక్షులు అమీర్ బాషా పిలుపునిచ్చారు. స్థానిక బహదూర్ పేట మస్జిద్ మహమ్మదీయలో జమ అతే ఇస్లామీ హింద్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మత్తు పదార్థాల నిర్మూలనపై కరపత్రాలు, గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈనెల 8వ తేదీ నుంచి 18వ తేదీ వరకు మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. షేక్ మహమ్మద్, దావూద్, ముజమ్మల్, గౌస్ మొదీన్, ఇంతియాజ్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 16: శ్రీకృష్ణ దేవరాయల జయంతిని శుక్రవారం పట్టణంలోని కార్గిల్ సెంటర్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. ఈ కార్యక్రమంలో కాపు సంక్షేమ సేన నాయకులు అంజూరు బాల సుబ్రమణ్యం, కాపు సంక్షేమ సేన నియోజకవర్గ అధ్యక్షులు వేణుగోపాల్ నాయుడు, పట్టణ అధ్యక్షులు నవీన్ కుమార్, పట్టణ ఉపాధ్యక్షులు కంఠా సుబ్రహ్మణ్యం, పట్టణ ప్రధాన కార్యదర్శి మునిరాజా పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ప్రత్యేక అధికారిగా భ్రమరాంబ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 16: శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిగా దేవాదాయ శాఖ జాయింట్ కమిషనర్ భ్రమరాంబను నియమించారు. ఈ మేరకు దేవాదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ముక్కంటి ఆలయ ఈవోగా పనిచేసిన భ్రమరాంబ మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణపై అందరి నుంచి ప్రశంసలు అందుకున్నారు. ప్రస్తుతం ఆమె దేవాదాయ శాఖ హెడ్ క్వార్టర్స్‌లో జాయింట్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. రెండు వారాల్లో ప్రారంభం కానున్న మహాశివరాత్రి ఉత్సవాలకు ఆమెను చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ గా కేటాయించారు.

ఆలయ విభాగాలపై ఈవో అధ్యయనం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 16: ముక్కంటి ఆలయంలో పలు విభాగాల నిర్వహణపై ఈవో నాగేశ్వరరావు శుక్రవారం అధ్యయనం చేశారు. సీసీ కెమెరా కంట్రోల్ రూమ్, ఆర్జిత సేవ టికెట్ కౌంటర్లు, గోశాల నిర్వహణను పరిశీలించారు. అలాగే కైలాస సదన్, గంగాసదన్ అతిథి గృహాలను, లోబావి, గోశాల నక్షత్రవనం వర్మీకంపోస్టు యార్డును ఆయన పరిశీలించారు.

నల్ల రిబ్బన్లతో ఉపాధ్యాయుల నిరసన



బుచ్చియుడుకండ్రిగ, ఫిబ్రవరి 16: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్ల రిబ్బన్‌లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెండింగ్ డీఏలు విడుదల చేయాలని, 30 శాతం ఐఆర్ ప్రకటించాని, పీఎఫ్, ఏపీజీ, ఎల్ఐ, మెడికల్ బిల్లులు, సరెండర్ లీవుల నగదు చెల్లించాలని కోరారు.

రాయితీపై నూర్పిడి యంత్రం పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 16: మండలంలోని కనమనంబేడు గ్రామానికి చెందిన రైతు షణ్ముగంకు వేరుశెనగ నూర్పిడి యంత్రాన్ని మండల వ్యవసాయాధికారి భారతి శుక్రవారం మండల కేంద్రంలో పంపిణీ చేశారు. పద్మావతి ఫార్మర్ ప్రొడ్యూసర్ కో-ఆపరేటివ్ సొసైటీ ద్వారా రాయితీ రైతుకు రూ.2లక్షలకు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో సురుటుపల్లి దేవస్థానం మెంబరు అజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

బృందమ్మ కాలనీలో నీటి సమస్య పరిష్కారం



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 16: శ్రీకాళహస్తిలోని బృందమ్మ కాలనీలో బొజ్జల కుటుంబం తమ సొంత నిధులతో తాగునీటి బోరు వేయించారు. కాలనీలో తాగునీటి సమస్య ఉందని స్థానికులు బొజ్జల రిషితారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె బృంద మ్మతో కలిసి శుక్రవారం బోరు వేయించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్య క్షులు విజయ్‌కుమార్, పార్లమెంట్ కోశాధికారి కంఠా రమేష్ పాల్గొన్నారు.

ఆర్‌వో వాటర్‌ప్లాంట్ వితరణ

రేణిగుంట,ఫిబ్రవరి16: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సురక్షితమైన తాగునీటి వసతి కల్పించడానికి విర్బాక్ యానిమల్ హెల్త్ ఇండియా కంపెనీవారు లక్ష రూపాయల విలువ గల ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. శుక్రవారం ఈ ప్లాంట్‌ను ఆ కంపెనీ జిల్లా మేనేజరు ఎం.తిరుపతిరెడ్డి ప్రారం భించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కైలాష్, మణికంఠ, పశువైద్యశాల ఏడీ డాక్టర్ సునీత, డాక్టర్ స్రవంతి, హెచ్‌ఎం పీవీసీకే ప్రసాద్, జి.రఘుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రుణమాఫీ చేయాలి

పిచ్చాటూరు, ఫిబ్రవరి 16: రైతులకు కేరళ తరహా రుణమాఫీ చేయాలని, అలాగే ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ.600 చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. నాయకులు చంద్రబాబు, పురుషోత్తంరెడ్డి, అన్నాదొరై పాల్గొన్నారు.

మనోధైర్యమే మహాబలం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 16: మనోధైర్యమే మహాబలం అని రోటరీ క్లబ్ కార్యదర్శి డాక్టర్ వెంకటరామన్ అన్నారు. పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మహిళా సాధికారతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు చంద్రబాబు, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఒరిగిపోయిన బస్సు.. తప్పిన ముప్పు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 16: విజయవాడ నుంచి బెంగళూరుకు వెళుతున్న ఓ ప్రైవేటు బస్సు శ్రీకాళహస్తి శివారులోని జైహింద్ పురం వద్ద ఓ పక్కకు ఒరిగిపోయింది. రోడ్డు పనుల్లో భాగంగా మట్టితో నిర్మిస్తున్న ర్యాంపు పైకి ఒకవైపు చక్రాలు ఎక్కడంతో ఒరిగిపోయింది. బస్సు బోల్తా పడు తుందేమోనని ప్రయాణికులంతా భయంతో కేకలు వేశారు. డ్రైవర్ చాకచక్యంగా బస్సును అదుపుచేయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

శాస్త్రోక్తంగా రథసప్తమి


విశేష అలంకారంలో సూర్యనారాయణమూర్తి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 16: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం రథసప్తమి పర్వదినం పురస్కరించుకుని శాస్త్రోక్తంగా పూజలు నిర్వ హించారు. ఇందులో భాగంగా ముక్కంటి ఆలయ మూడవ ప్రవేశ మార్గంలో వెలసిన సూర్యనారాయణ మూర్తి సన్నిధిని ముందుగా శుద్ధి చేశారు. కలశ స్థాపనతో సంకల్పం పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ విశేష పూజా ద్రవ్యాలతో సూర్యనారాయణ మూర్తిని అభిషేకించారు. అనంతరం ప్రత్యేక అలంకారంలో స్వామివారు భక్తులకు దర్శనం ఇచ్చారు. ధూప దీప నైవేద్య హారతులు సమర్పించారు.


తేరు వీధిలో ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

సూర్యప్రభపై శివయ్య చిద్విలాసం

రథసప్తమి పర్వదినం పురస్కరించుకొని స్వామి, అమ్మవార్ల నగరోత్సవం చతుర్మాడ వీధుల్లో వేడుకగా జరిగింది. ఇందులో భాగంగా సూర్యప్రభ వాహనంపై శివయ్య చిద్విలాసంతో దేవేరి జ్ఞాన ప్రసూనాంబిక అమ్మవారు చెప్పరం వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ప్రధాన అర్చకులు కరుణాకర్ గురుకుల్, అధికారులు హరియాదవ్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవమూర్తుల ఊరేగింపులో గందరగోళం


ఊరేగింపులో అడ్డుగా ఉన్న వాహనాలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 16: జ్ఞాన ప్రసూనాంబికా సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి ఉత్సవ మూర్తుల ఊరేగింపులో గందరగోళం నెలకొంది. కనీస ప్రణాళిక లేకుండా అధికారులు చూపిన అత్యుత్సాహంతో భక్తులకు అవస్థలు తప్పలేదు. శుక్రవారం ఉదయం చతుర్మాడా వీధుల్లో స్వామి అమ్మవార్ల ఊరేగింపు జరిగే విషయం అందరికీ ముందుగానే తెలుసు. సరిగ్గా ఊరేగింపు సమయంలో మాడవీధుల్లో విద్యుత్తు స్తంభాల ఏర్పాటు ప్రాజెక్టుకు శిలాఫలకం ఆవిష్కరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. సూపర్ బజార్ కూడలిలోని బియ్యపు కృష్ణారెడ్డి మండపంలో ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సమయంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ముక్కంటి ఆలయ అధికారులు సూపర్ బజార్ కూడలిలో నడి రోడ్డుపై వాహనాలను పార్క్ చేశారు. అసలు ఊరేగింపు సమయంలో శిలాఫలకం ఆవిష్కరణ కార్యక్రమం పెట్టడమే అనాలోచితం. దానికి తోడు కనీసం వాహనాలను కూడా అదుపు చేయలేకపోయారు. ఇదే సమయంలో స్వామి అమ్మవార్ల ఊరేగింపు అక్కడకు చేరుకోవడంతో తీవ్ర గందరగోళం నెలకొంది. పక్కపక్కనే సాగాల్సిన స్వామి అమ్మవార్లు ముందు వెనక అనుసరించాల్సి వచ్చింది.

పోలీస్ అధికారి అత్యుత్సాహం

అసలే చిరాకుతో ఉన్న జనంపై ఓ పోలీస్ అధికారి అత్యుత్సాహం ప్రదర్శించారు. ఊరేగింపు సమయంలో ప్రారంభోత్సవానికి అనుమతి ఇవ్వడం అధికారులు తప్పు. అదే సమయంలో నడిరోడ్డుపై వాహనాలను భారీగా పార్కింగ్ చేస్తున్నా పట్టించుకోలేదు. దాంతో ట్రాఫిక్ స్తంభించింది. మితిమీరిన స్వామి భక్తితో ఓ పోలీసు అధికారి వ్యవహరించడంతో ఈ సమస్య ఉత్పన్నమైంది. ట్రాఫిక్‌లో జనాలు ఇబ్బంది పడుతూ ఉంటే.. తిరిగి వారిపైనే కేకలు వేయడంతో అందరూ విస్తు పోయారు. ఇదేం అత్యుత్సాహం అంటూ కొందరు నిలదీయడంతో అధికారి అక్కడి నుంచి జారుకున్నారు.

ప్రహరీ పనుల అడ్డగింత


ప్రజలతో మాట్లాడుతున్న తహసీల్దారు

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 16: వరదయ్యపాళెం మండలం పెద్దపాండూరు పంచాయతీలోని ముట్టంగితిప్ప, సుబ్బానాయుడు కండ్రిగ పరిసరాల్లో శుక్రవారం తమిళనాడు పురావస్తుశాఖ వారు ప్రహరీ నిర్మించేందుకు వచ్చారు. తమిళనాడు నుంచి ఆంధ్రప్రదేశ్ విభజన జరిగిన సమయంలో సర్వే నెం.729లో 65.60 సెంట్లు తమిళనాడు పురావస్తు శాఖకు కేటాయించారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో బీసీలు, గిరిజనులు నివసిస్తున్నారు. ఈ క్రమంలో తమిళనాడు అధికారులు ప్రహరీ నిర్మించడానికి రావడంతో గిరిజనులు అడ్డుకున్నారు. తహసీల్దారు ఉదయభారతి అక్కడికి చేరుకున్నారు. తమిళనాడు పురావస్తుశాఖ వారితో మాట్లాడారు. ఆర్డీవో చంద్రముని విచారణ చేశారన్నారు. నివేదిక ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంతవరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని స్పష్టం చేశారు. దీంతో పురావస్తుశాఖ వారు వెనుదిరిగారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ వెంకటరమణ, ఆర్ఐ వేణుగోపాల్, సీపీఐ నాయకులు, చిన్నిరాజ్, వీఆర్వో ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికలావాదేవీలపై ఘర్షణ.. ఇద్దరికి గాయాలు


గాయపడిన జ్యోతి, వరుణ్

తొట్టంబేడు, ఫిబ్రవరి 16: మండలంలోని తాటిపర్తి గ్రామంలో ఆర్థిక లావాదేవీల విషయంపై జరిగిన ఘర్షణలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్ఐ రాఘవేంద్ర కథనం మేరకు.. శ్రీకాళహస్తి పట్టణంలో చిన్నకన్నలి గ్రామానికి చెందిన జ్యోతి కుమారుడు వరుణ్ తిరుపతికి చెందిన విజయ్ స్నేహితులు. ఈ క్రమంలో విజయ్ ఆస్తిని వరుణ్ తాకట్టుపెట్టుకొని రూ. 20లక్షలు అప్పుగా ఇచ్చాడు. రూ.80వేలు అలాగే ఉండిపోయింది. మిగిలిన మొత్తం చెల్లించాడు. దీనిపై ఇద్దరి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. దానికి సంబంధించి శుక్రవారం వరుణ్ తాతగారి ఊరైన తాటిపర్తిలో మధ్యస్తం నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.80 వేలు ఇవ్వ లేనని విజయ్ చెప్పాడు. దీనికి వరుణ్ తల్లి ఒప్పుకోలేదు. దీంతో విజయ్ తన కారు వద్దకి వెళ్లి కారులో ఉన్న ఒక్క చిన్నచాకుతో వరుణ్ గుండెపై పెట్టి బెదిరించాడు. ఆ సమయంలో వరుణ్ తల్లి అతడితో ఘర్షణకు దిగింది. పక్కనే ఉన్న తొలికితో ఆమెతలపై మోదాడు. ఆమె గాయపడింది. ఈ పెనుగులాటలోనే వరుణ్ ఛాతీపై స్వల్పగాయాలయ్యాయి. తల్లీకుమారులు శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. జ్యోతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఫ్రిజ్ పేలి.. ఇల్లు దగ్ధం

సత్యవేడు, ఫిబ్రవరి 16: ఫ్రిజ్ పేలి ఇల్లు దగ్ధమైంది. ఈ సంఘటన సత్యవేడు మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు... రేపల్లెవాడకు చెందిన భానుప్రసాద్‌రెడ్డి ఇంట్లోని ఫ్రిజ్ నుంచి పొగలు వచ్చాయి. ఇల్లంతా పొగలు వ్యాపించడంతో ఆయన తల్లి భాగ్యమ్మకు ఊపిరాడకపోవడంతో వెంటనే బయటకు వచ్చేసింది. అంతలోనే ఫ్రిజ్ పేలింది. పేలుడు ధాటికి ఇంటిపై కప్పు రేకులు, గోడ ధ్వంసమైంది. ఇంటి లోపల మంటలు వ్యాపించి దుస్తులు, సామగ్రి రూ.70 వేలు నగదు కాలిపోయాయి.

సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ

పిచ్చాటూరు, ఫిబ్రవరి 16: ముడియూరు (ఎల్‌వీ పురం) గ్రామానికి చెందిన లోకేష్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అందజేశారు. రోడ్డు ప్రమాదంలో లోకేష్ గాయపడడంతో స్థానిక నాయకుల విన్నపం మేరకు మంత్రి సీఎం రిలీఫ్ ఫండ్ అందించారు. శుక్రవారం తిరుపతిలోని మంత్రి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల మాజీ కన్వీనర్ హరిశ్చంద్రారెడ్డి, కారూరు ఎంపీటీసీ వేలు తదితరులు పాల్గొన్నారు.

భూహక్కు చట్టం రద్దు చేయండి

రేణిగుంట, ఫిబ్రవరి16: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన భూహక్కు చట్టం 2022ను వెంటనే రద్దుచేయాలని టీడీపీ రైతు నాయకులు పి.మునస్వామినాయుడు, పి.చిన్నారెడ్డి డిమాండ్ చేశారు. రేణిగుంట మండలం గుత్తివారిపల్లిలో రైతులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. నాయకులు ఉదయ్‌కుమార్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, వెంకటరమణ, రవి, మురళి పాల్గొన్నారు.

బాల్యవివాహాలు నిర్మూలించాలి

ఏర్పేడు, ఫిబ్రవరి 16: బాల్య వివాహాలను నిర్మూలించాలని రేణిగుంట ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి కృష్ణమంజరి కోరారు. ఏర్పేడు లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాల్యవివాహాల నిర్మూ లనపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ప్రభుత్వ భూములు పేదలకు పంచుతాం


టీడీపీలో చేరుతున్న వివిధ పార్టీల నాయకులు

రేణిగుంట, ఫిబ్రవరి16: టీడీపీ అధికారంలోకి రాగానే ప్రభుత్వ భూములను పరిరక్షించి పేదలకు పంచుతామని ఆ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం కరకంబాడి పంచాయతీ తారకరామానగర్‌లో ఏర్పాటు చేసిన సభలో పంచాయితీలోని పలు గ్రామాల్లో వున్న వైసీపీ, సీపీఐ, సీపీఎం నాయకులు 670 మంది టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. సుధీర్‌రెడ్డి వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వా నించారు. కరకంబాడి పంచాయితీ క్లస్టర్ నాయకుడు బుజ్జినాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు టి.మునిచంద్రారెడ్డి, నాయకులు మునస్వామి నాయుడు, తిరుపతి పార్లమెంట్ ఉపాధ్య క్షుడు సి.సుబ్రమణ్యంరెడ్డి, నియోజకవర్గం రైతు అధ్యక్షుడు పి.చిన్నారెడ్డి పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో వైసీపీకి చెందిన పులగూర కోటి, సుబరత్నమ్మ, మహేష్‌తో పాటు 9గ్రామాల నుంచి 670 మంది ఉన్నారు. అంతకుముందు రేణిగుంట చెక్‌పోస్టు కూడలిలో సుధీర్‌రెడ్డికి నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు.

గిట్టుబాటు ధరకు చట్టబద్ధత కల్పించండి


శ్రీకాళహస్తిలో గ్రామీణ బంద్‌కు మద్దతుగా ర్యాలీ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 16: అన్ని పంటలకు గిట్టుబాటు ధరకు గ్యారంటీ చట్టం చేయాలని కార్మిక, కర్షక సంఘాలు డిమాండ్ చేశాయి. వ్యవసాయ నల్ల చట్టాల రద్దుతో పాటు పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలంటూ డిల్లీలో రైతులు చేస్తున్న ఉద్యమానికి బాసటగా శుక్రవారం శ్రీకాళహస్తిలో కార్మిక, కర్షక సంఘాల నాయకులు, రైతులు నిరసన ర్యాలీ చేపట్టారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, రైతు సంఘం జిల్లా నాయకులు రామిశెట్టి వెంకయ్య, సీఐటీయు నాయకులు గంధం మణి, వెంకటేష్, వేణు, రాజా, ఏఐటీయూసీ నాయకులు మించల శివకుమార్ పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: వరదయ్య పాళెం బస్టాండు వద్ద ప్రజా సంఘాల నాయకులు నిరసన ప్రదర్శన చేశారు. నిత్యావసరాల ధరలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని నినాదాలు చేశారు. ● వ్యవసాయ నల్లచట్టాలను రద్దు చేసి చట్టం చేయాలని సీఐటీయూ తిరుపతి జిల్లా అధ్యక్షులు దాసరి జనార్ధన్ డిమాండ్ చేశారు. తహసీల్దారు కార్యాలయం వద్ద రైతులు నిరసన వ్యక్తం చేశారు.

సత్యవేడు: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం ఆగదని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రమేష్ స్పష్టం చేశారు. సత్యవేడులో సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె నిర్వహించారు. రమేష్ మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరారు. సీఐటీయూ, కేవీపీఎస్, రైతు సంఘం, గిరిజన సంఘం, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

డిప్.. డిప్.. డిప్

డిప్.. ఇది పచ్చడి కాదు.. అలాగని సాస్ కూడా కాదు. ఈ మధ్యకాలంలో ఫాస్ట్‌ఫుడ్ కల్చర్ బాగా పెరిగిన తర్వాత వినిపిస్తున్న పేరు. ఈ డిప్‌లను చిప్స్, చికెన్ లాలీపాప్స్ వంటి వాటితో పాటుగా దోసెలతో తిన్నా బానే ఉంటుంది. ఇలాంటి కొన్ని డిప్‌లను ఎలా చేయాలో తెలుసుకుందాం.

వంటిల్లు

1 స్మోకీ ఎగ్‌ప్లాంట్ డిప్

కావాల్సిన పదార్థాలు: రెండు పెద్ద వంకాయలు, రెండు టీస్పూన్ల ఆలీవ్ నూనె, ఒక టేబుల్ స్పూన్ రాళ్ల ఉప్పు, ఆరు టీస్పూన్ల ఆవాల పేస్ట్, ఒక స్పూను జీలకర్ర పౌడర్, రెండు వెల్లుల్లి రెబ్బలు, ఒక టేబుల్ స్పూన్ నిమ్మ రసం, రుచికి తగ్గట్టుగా మిరియాల పొడి, ఒక టేబుల్ స్పూన్ బాగా తరిగిన కొత్తిమీర

తయారుచేసే విధానం: వంకాయలను స్టౌ మీద బాగా కాల్చాలి. చల్లారిన తర్వాత పై తొక్క తీయాలి. లోపల ఉన్న గుజ్జును బయటకు తీసి- ఆవాల పేస్ట్‌లో కలపాలి. ఆ తర్వాత ఆ మిశ్రమంలో ఉప్పు, జీలకర్ర పౌడర్, వెల్లుల్లి రెబ్బలు, మిరియాల పొడిని వేసి మిక్సీలో మెత్తగా తిప్పాలి. దీనిలో ఆలీవ్ నూనెను, కొత్తిమీరను కలపాలి. దీనిని చిప్స్‌లో మాత్రమే కాకుండా దోసెలలో తిన్నా బానే ఉంటుంది.



2 మింట్ పీస్ డిప్

కావాల్సిన పదార్థాలు: ఒక కప్పుడు పచ్చి బఠానీలు, మూడు టేబుల్ స్పూన్ల నిమ్మరసం, పది వెల్లుల్లి రెబ్బలు, ఒక పావు కప్పు తరిగిన పుదీనా, రెండు టేబుల్ స్పూన్ల ఆలీవ్ ఆయిల్, అర టేబుల్ స్పూన్ రాళ్ల ఉప్పు

తయారు చేసే విధానం: పచ్చి బఠానీలను కుక్కర్‌లో మూడు విజిల్స్ వచ్చే వరకు ఉడకపెట్టాలి. ఇవి చల్లారే లోపులో వెల్లుల్లి రెబ్బలు, పుదీనాను మిక్సీలో వేసి ముద్దగా చేయాలి. ఆ తర్వాత ఉడకపెట్టిన బఠానీలను, రాళ్ల ఉప్పును కూడా కలిపి మళ్లీ మిక్సీలో వేసి తిప్పాలి. ఆ మిశ్రమంలో నిమ్మరసాన్ని, ఆలీవ్ ఆయిల్‌ను కలపాలి. దీనిని నాన్‌వెజ్ స్టార్టర్స్‌తో కలిపి తింటే చాలా బావుంటుంది.



3 క్యారెట్ కొరియాండర్ డిప్

కావాల్సిన పదార్థాలు: మూడు క్యారెట్లు (చిన్న ముక్కలుగా తరిగి పెట్టుకోవాలి), రెండు టేబుల్ స్పూన్ల నిమ్మరసం, అల్లం ముక్కలు (రుచికి సరిపడా), ఒక స్పూను గరమ్ మసాలా, ఒక స్పూను జీలకర్ర పొడి, ఒక టేబుల్ స్పూన్ సన్నగా తరిగిన కొత్తిమీర, తగినంత ఉప్పు

తయారుచేసే విధానం: క్యారెట్‌లను మిక్సీలో వేసి ముద్దలా చేయాలి. దీనిలో గరమ్ మసాలా, జీలకర్ర పొడి, అల్లం ముక్కలు, నిమ్మరసం, ఉప్పు వేసి మరో సారి బాగా తిప్పాలి. ఆ మిశ్రమంలో సన్నగా తరిగిన కొత్తిమీరను కలపాలి. దీనిని ఫ్రిజ్‌లో ఉంచుకొని తింటే చాలా బావుంటుంది.



4 స్పైసీ కేషు డిప్

కావాల్సిన పదార్థాలు: రెండు కప్పుల వేయించిన జీడిపప్పు, రెండు వెల్లుల్లి రెబ్బలు, పావు కప్పు నువ్వులు, ఒక పెద్ద గ్లాసు కొబ్బరి పాలు, మూడు టేబుల్ స్పూన్ల నిమ్మరసం, ఒక టేబుల్ స్పూన్ ఆలీవ్ నూనె, అర టేబుల్ స్పూన్ మిరియాల పొడి, తగినంత ఉప్పు

తయారు చేసే విధానం: జీడిపప్పును నాలుగు గంటలు నీళ్లలో నానబెట్టాలి. తర్వాత మిక్సీలో వేసి ముద్ద చేయాలి. ఈ ముద్దలో కొబ్బరి పాలు, వెల్లుల్లి రబ్బలు, నువ్వులు, మిరియాల పొడి, ఉప్పు వేసి బాగా మెత్తగా చేయాలి. ఈ మిశ్రమంలో దీనిలో నిమ్మరసం, ఆలీవ్‌నూనెలను కలపాలి. దీనిని నాచోస్, క్యారెట్ స్టిక్స్‌లతో కలిపి తింటే చాలా బావుంటుంది.



నువ్వుల నూనె పచ్చడి

క్షేమ కుతూహలం

తిలనింబాది సంయుక్తం
కల్కో బలప్రదః
వహ్నిసంజననః ప్రోక్తో విశే
షేణానిలాపహః

అని క్షేమకుతూహలంలో క్షేమశర్మ నువ్వులకు ఉన్న విశిష్టతలను వర్ణిస్తాడు. అతి పురాతనమైన ఆయుర్వేద శాస్త్రంలో కూడా నువ్వులకు ప్రత్యేక స్థానం ఉంది. ప్రస్తుతం అందరూ పామోలిన్ లేదా పొద్దుతిరుగుడు నూనెను వాడుతున్నారు కానీ ఒకప్పుడు నువ్వుల నూనెను విరివిగా ఉపయోగించేవారు.

నువ్వులు చాలా ప్రాచీనమైనవి. సెసేమమ్ ఇండికమ్ అనే గింజల నుంచి తొలిసారి నూనెను తీశారట. ఈ గింజలను తిలలు అనేవారు. ఈ తిలల నుంచి తీసినది కాబట్టి తైలం అయింది. ఆ తర్వాతి కాలంలో తైలం అంటే నూనె అనే అర్థం స్థిరపడింది. పౌష్టికాహార నిపుణుల అధ్యయనాల ప్రకారం చూస్తే- పొట్టు తీయని నువ్వుల్లో కాల్షియం ఎక్కువగా ఉంటుంది. కానీ ప్రస్తుతం మనకు పొట్టు తీసిన నూనె ఎక్కువగా అందుబాటులో ఉంటోంది. దీనినే పప్పునూనె అని కూడా పిలుస్తారు. నువ్వులు తీయగా మిగిలిన పదార్థాన్ని దంచగా వచ్చిన దాన్ని తెలగపిండి అని ఉంటారు. ఇలా నువ్వుల నుంచి తీసిన నూనెనే కాకుండా.. నువ్వులతో కూడా రకరకాల వంటలు చేస్తారు. అవేమిటో చూద్దాం.

నువ్వుల నూనె పచ్చడి: వినటానికే వింతగా అనిపించే వంటకం ఇది. అధిక జీర్ణశక్తి కావాలనుకొనేవారికి ఈ నూనె పచ్చడి బాగా ఉపకరిస్తుంది. అరకప్పు నల్లనువ్వుల నూనెను తీసుకోవాలి. దానిలో అరకప్పు నిమ్మరసం కలపాలి. ఈ మిశ్రమంలో సన్నగా తరగిన అల్లం ముక్కలను కలపాలి. దీనిని మిక్సీలో వేసి ముద్దగా చేసుకుంటే- దానినే నువ్వుల నూనె పచ్చడి అంటారు. సాధారణంగా దీనిని అన్నం తినే సమయంలో మొదటి ముద్దలో కలుపుకొని తింటారు. దీని వల్ల జీర్ణశక్తి బాగా పెరుగుతుంది. వాతం అదుపులో ఉంటుంది. గ్యాస్ ఉత్పత్తి తగ్గుతుంది.

నువ్వుల పొడి: నువ్వుల పొడిని మన పూర్వీకులు తప్పనిసరిగా తినేవారు. అందుకే క్షేమశర్మ తన క్షేమకుతూహలంలో నువ్వుల పొడిని ఎలా చేసుకోవాలో వివరించాడు. నల్ల లేదా పొట్టు తీసిన నువ్వులను దోరగా వేయించాలి. వాటిలో సైంధవ లవణం, మిరియాలు, జీలకర్ర కలిపి మిక్సీలో పొడి చేయాలి. దానిలో వేడి అన్నంలో నిమ్మరసం వేసుకొని తింటే శరీరానికి బలమిస్తుంది. సాధారణంగా నువ్వుపొడి తింటే వేడి చేస్తుంది కాబట్టి నిమ్మరసం కలుపుకోమంటారు



నువ్వుల కట్టుపొంగలి: బియ్యం, నువ్వులు, మినపప్పులను తగు పాళ్లలో కలిపి అన్నం మాదిరిగా వండితే దాన్ని నువ్వుల పులగం లేదా కట్టుపొంగలి అంటారు. దీన్ని తింటే వాత వ్యాధులు తగ్గుతాయి. శరీరానికి శక్తి సమకూరుతుంది. దీనిలో కొందరు అల్లం ముక్కలు కూడా కలుపుతారు. ఈ విధంగానే మన పూర్వీకులు నువ్వులను రకరకాల వంటల్లో భాగం చేశారు.

ప్రయోజనాలెన్నో..

నువ్వులు వేడి చేసే స్వభావం కలిగినవి. చలిప్రాంతాల వారికి ఎక్కువ అనుకూలంగా ఉంటాయి. కానీ, ఉష్ణమండలం అయిన మన దగ్గర ఎక్కువ పండుతాయి. నువ్వులు మూత్రం ఎక్కువ కాకుండా ఆపుతాయి. జీర్ణశక్తిని పెంచుతాయి. శరీరానికి నీరు పడితే- తగ్గటంలో ఉపకరిస్తాయి. వెంట్రుకల కుదుళ్లను బలోపేతం చేస్తాయి. దంతాలను బలపరుస్తాయి.

● గంగరాజు అరుణాదేవి

ఆర్థిక పాఠసారి

డిజిటల్ స్టార్

పెట్టుబడులు... రాబడులు... ఆదాయాలు... పన్నులు... ఆర్థిక లావాదేవీల నిర్వహణే కాదు... వాటిని అర్థం చేసుకోవడం కూడా క్లిష్టమైనదే... అంటుంది **అనుష్కా రాథోడ్**. అందుకే ఆ సంక్లిష్టమైన విషయాలను సులువుగా అర్థమయ్యేలా... పొట్టి వీడియోల్లో పెట్టి లక్షలమందికి అవగాహన కల్పిస్తోంది. ముఖ్యంగా మహిళలను దృష్టిలో పెట్టుకొని 'ఫైనాన్స్ పాఠాలు' చెబుతోంది. ట్యాక్సేషన్‌లో పీజీ చేసిన ఈ గుజరాత్ అమ్మాయి... తాజాగా ప్రతిష్టాత్మక 'ఫోర్బ్స్ ఇండియా' మ్యాగజైన్ ప్రకటించిన '30 అండర్ 30'లో చోటు సంపాదించుకుంది.

"చిన్నప్పటి రోజులు ఇంకా నా కళ్ల ముందు మెదులుతున్నాయి. గుజరాత్‌లోని సూరత్ మాది. మార్వాడీ కుటుంబం కావడంతో అందరూ వ్యాపార కార్యకలాపాల్లో క్షణం తీరిక లేకుండా గడిపేవారు. రాత్రి భోజన సమయంలో కూడా డైనింగ్ టేబుల్ దగ్గర నాన్న, తాతయ్య, మావయ్యలు కూర్చొని బిజినెస్ ప్రాజెక్ట్‌ల గురించే మాట్లాడుకునేవారు. ఉన్న వ్యాపారాన్ని ఎలా విస్తరించాలి? ఎంతమొత్తంలో పెట్టుబడి పెట్టాలి? కొత్తగా ఎలాంటి బిజినెస్ ప్రాజెక్ట్‌లు చేపట్టాలి? ఇలా అన్నీ వ్యాపార సంబంధమైన చర్చలే వారి మధ్య నడిచేవి. ఇవన్నీ నాకు డబ్బుని పరిచయం చేశాయి. దాని ప్రాథమిక సూత్రాలు వంటబట్టాయి. ప్రధానంగా అర్థమైంది ఏమిటంటే... వ్యాపార కుటుంబం కావడంవల్ల స్థిరమైన ఆదాయం ఉండేది కాదు. కొన్ని నెలలు అద్భుతంగా డబ్బు కనిపించేది. మరికొన్ని మాసాలు వచ్చింది ఖర్చులకు సరిపోయేది. దానివల్ల మేం ఎప్పుడూ బడ్జెట్ దాటకుండా చూసుకోవాల్సి వచ్చేంది. వ్యాపారంలో రేపు ఎంత సంపాదిస్తామన్నది అంచనా వేయలేం. కనుక ఉన్నదాంట్లోనే పొదుపుగా ఖర్చు చేయాలి. ఇంట్లోనే భవిష్యత్తుకు ఉపయోగపడే ఎన్నో పాఠాలు నేర్చుకున్నా.

అనుకున్నది ఒకటి...

మా కుటుంబ నేపథ్యానికి భిన్నంగా నా జీవితాన్ని మలుచుకోవాలని అనుకున్నా. అందుకే అమెరికాలోని ప్రపంచ ప్రసిద్ధ 'డ్యూక్ యూనివర్సిటీ'లో మాస్టర్స్ చదవాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నా. దాని కోసం ఎంతో కష్టపడ్డాను. సీఎఫ్‌ఏ లెవల్ వన్ పూర్తయిన తరువాత ఆ వర్సిటీకి దరఖాస్తు చేసుకున్నా. స్కాలర్‌షిప్‌తో సీటు కూడా వచ్చింది. అక్కడే కథ అడ్డం తిరిగింది. అనుకున్నవన్నీ జరిగితే అది జీవితం ఎందుకు అవుతుంది? అదే సమయంలో కరోనా విలయం మొదలైంది. ప్రపంచమంతా లాక్‌డౌన్. ఆశలన్నీ ఆవిరయ్యాయి. ఎన్నో కలలు కని సీటు సాధించుకున్నా వెళ్లలేని పరిస్థితి. చివరికి విధి మరోలా తలచిందని సరిపెట్టుకున్నా.

రూటు మార్చిన కొవిడ్...

దానికి మూడేళ్ల ముందర, అంటే 2017లో 'డమోస్ కేపిటల్ ప్రైవేట్ లిమిటెడ్'లో, తరువాత ఏడాదిపాటు 'పరాగ్ పారిఖ్ ఫైనాన్షియల్ అడ్వైజరీ సర్వీసెస్ లిమిటెడ్'లో ఇంటర్న్‌షిప్ చేశాను. అది అవ్వగానే 'ప్రొఫిషియో అడ్వైజర్స్'లో కొన్నాళ్లు 'ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ ఎనలిస్ట్'గా చేరాను. అక్కడ కంపెనీలు, వాటి ఆర్థిక లావాదేవీలకు సంబంధించి ఎన్నో విషయాలు నేర్చుకోవడానికి అవకాశం లభించింది. ఇవన్నీ నాకు సంతృప్తినివ్వలేదు. అందుకే 'డ్యూక్ యూనివర్సిటీ'కి వెళ్లి చదవాలనుకున్నా. కొవిడ్‌తో ఆ లక్ష్యం పక్కకు వెళ్లిపోయింది. ఖాళీగా ఇంట్లో కూర్చుంటే.. స్నేహితులు, సన్నిహితులు కొందరు సలహాలు అడగడం మొదలుపెట్టారు. 'ఎక్కడ పెట్టుబడి పెట్టాలి? పన్ను ఆదా ఎలా చేసుకోవాలి?' లాంటి వాటికి నాకున్న పరిజ్ఞానంతో సలహాలు ఇచ్చేదాన్ని. వారిలో ఎక్కువగా మహిళలే ఉండేవారు. ఆలోచిస్తే అర్థమైంది ఏంటంటే.. ఆర్థిక వ్యవహారాల పట్ల చాలామంది మహిళలకు సరైన అవగాహన లేదని. ఎక్కువగా ఇళ్లలోని మగవారే ఈ వ్యవహారాలన్నీ చూసుకోవడంవల్లనేమో.. గృహిణులు వాటిని పెద్దగా పట్టించుకోవడంలేదు. దాంతో చిన్నపాటి సమాచారానికే వేరొకరిపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ పరిస్థితిలో కొంతైనా మార్పు తేవాలనుకున్నాను.

నాతోనే మొదలు...

అనుకున్నదే తడవుగా 'అనుష్కా రాథోడ్ ఫైనాన్స్' పేరుతో వెంటనే ఒక యూట్యూబ్ చానల్ ప్రారంభించాను. అందులో ఆర్థిక లావాదేవీలు, అమలవుతున్న పన్నులు, ఎవరు ఎంత కట్టాలి తదితర వివరాలన్నీ సూటిగా, సుత్తి లేకుండా చెప్పడం మొదలుపెట్టాను. నా ప్రత్యేకత ఏంటంటే ఎంత క్లిష్టమైన అంశమైనా ఎవరికైనా ఇట్టే అర్థమైపోయేట్టు వివరించడం. సహజంగా ఆర్థికపరమైన కంటెంట్ పట్ల ఎవరికీ అంత ఆసక్తి ఉండదు. కనుక దానికి కొంత వినోదం జోడించి విపులంగా చెబుతున్నా. అంటే 'ఇన్ఫోటైన్‌మెంట్' అనమాట. యూట్యూబ్‌లో వెతికితే అప్పటివరకు షార్ట్ వీడియోలతో ఫైనాన్స్ కంటెంట్ ఇచ్చే మహిళలు కనిపించలేదు. బహుశా భారత్‌లో ఆ ట్రెండ్ నాతోనే మొదలైందని అనుకొంటున్నా.

అవహేళనలు తప్పలేదు...

సరిగ్గా కరోనా మొదటి దశలో చానల్ ప్రారంభించా. ఆశించిన స్థాయిలో ఆదరణ లభించలేదు. ఏడాదంతా అదే పరిస్థితి. నా కంటెంట్ చూసి చాలామంది చులకనగా మాట్లాడేవారు. ఎందుకో తెలియదు... కొందరు అకారణంగా దూషిస్తూ కామెంట్లు పెట్టేవారు. ఇవిచాలవన్నట్టు నా వీడియోల మీద లీగల్ నోటీసులు కూడా పంపించినవారు ఉన్నారు. కానీ వేటికీ భయపడలేదు. అవి నా ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేశాయి. ఎందుకంటే నా కంటెంట్‌లో నేను ఎవరినీ కించపరచడంలేదు. ద్వేషించడంలేదు. అలాంటప్పుడు నేనెందుకు వెనక్కి తగ్గాలి? మనం సామాజిక మాధ్యమం అనే ఒక బహిరంగ వేదికపై ఉన్నాం. ఎన్నో రకాల మనుషులు వారికి తోచినట్టు స్పందిస్తుంటారు. అవన్నీ పట్టించుకొంటే ఎవరూ ముందడుగు వేయలేరని గ్రహించాను. మరింత కొత్తగా, ఆసక్తిగా, ప్రతి ఒక్కరికీ ఉపయోగపడేలా కంటెంట్ ఇవ్వడం మొదలుపెట్టాను. యూట్యూబ్‌తో పాటు ఇన్‌స్టాగ్రామ్‌లో కూడా రీల్స్ చేస్తూ వచ్చాను. వంద... వెయ్యి... పదివేలు... లక్ష... క్రమంగా ఆదరణ పెరుగుతూ పోయింది. ఇవాళ నా యూట్యూబ్ చానల్‌ను ఆరు లక్షలకు పైచిలుకు సబ్‌స్క్రైబ్ చేశారు. ఇన్‌స్టాలో ఎనిమిదిన్నర లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. ఇవికాకుండా 'లింక్డ్ ఇన్, ఫేస్‌బుక్' తదితర మాధ్యమాల్లో కలిపి దాదాపు ఇరవై లక్షల మంది నా కంటెంట్‌ను చూస్తున్నారు.

గర్వంగా ఉంది...

ప్రస్తుతం నేను 75కు పైగా బ్రాండ్స్‌తో కలిసి పని చేస్తున్నాను. నా చానల్ ద్వారా వాటికి ప్రచారం కల్పిస్తున్నాను. మా అమ్మ ఎప్పుడూ ఒకటి చెబుతూ ఉండేది... 'ప్రతి పోటీలో పాల్గొనాలి. గెలిచినా గెలవకపోయినా... దాని నుంచి ఏదో ఒకటి నేర్చుకొంటావు' అని. అదే నేను అనుసరిస్తున్నది. 'పార్టిసిపేషన్ సర్టిఫికెట్స్' అన్నీ సేకరిస్తూ వచ్చాను. ఇవాళ..! నేను గెలిచాను. ప్రతిష్టాత్మక 'ఫోర్బ్స్ 30 అండర్ 30' జాబితాలో నాకూ చోటు దక్కింది. తొమ్మిదేళ్లు హిందుస్తానీ సంగీతం నేర్చుకున్నాను. కానీ సంగీతంలో ఎదగలేకపోయాను. ఏడేళ్లు తైక్వాండో సాధన చేశాను. అనారోగ్య కారణాలతో వదిలేశాను. పోటీ పరీక్షలకు వెళ్లాను... రాష్ట్ర స్థాయి దాటలేకపోయాను. కలల కాలేజీలో సీటు సంపాదించాలనే ఏకైక లక్ష్యంతో రాత్రింబవళ్లు కష్టపడి చదివాను. కానీ కరోనాతో అటు వెళ్లలేకపోయాను. ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో కంటెంట్ క్రియేషన్ మొదలుపెట్టాను. చివరకు అదే నాకు విజయాన్ని అందించింది. 'ఫోర్బ్స్' కవర్ పేజీ మీద నా చిత్రం ప్రచురించే స్థాయికి నన్ను తీసుకువెళ్లింది. నాలానే ప్రతి ఒక్కరి జీవితంలో ఎత్తుపల్లాలు ఉంటాయి. సవాళ్లు ఎదురవుతాయి. అంతమాత్రం చేత పోటీ నుంచి తప్పుకొంటే ఏదీ సాధించలేం. వాటిని పాఠాలుగా మలుచుకుని ముందుకు సాగితేనే విజయం వరిస్తుంది."



శరీరం చెప్పుచేతల్లో...

యోగా

శరీరానికి వ్యాయామం కరువైతే చిన్న చిన్న పనులకే ఎముకలు, నరాలు పట్టేస్తూ ఉంటాయి. ఈ ఇబ్బందులు తొలగాలంటే ఫ్లెక్సిబిలిటీ పెంచే ఈ యోగాసనాలు సాధన చేయాలి.



ఉత్తనాసనం

ఈ ఆసనం వెన్ను కింది భాగం సాగేలా చేస్తుంది. ఆసనం నెమ్మదిగా ఊపిరి పీల్చి వదులుతూ చేయాలి. పూర్తి ఆసనానికి కనీసం 30 సెకండ్ల నుంచి 3 నిమిషాల సమయం తీసుకోవచ్చు. ఈ ఆసనం ఎలా వేయాలంటే...

- కాళ్ల మధ్య అర అడుగు ఎడం ఉండేలా నిలబడి మోకాళ్లను కొద్దిగా వంచి, చేతులు పైకి లేపి, నడుము దగ్గర్నుంచి శరీరాన్ని ముందుకు వంచాలి.
- రెండు చేతులు పాదాలను తాకించాలి.
- ఇలా చేసే సమయంలో మోకాళ్ల వెనక లాగినట్టు అనిపించడం సహజం. ఈ నొప్పి ఆసనం అలవాటయ్యేకొద్దీ తగ్గుతుంది.
- అలాగే ప్రారంభంలో కాళ్లను నిలువుగా ఉంచలేం. కాబట్టి మోకాళ్లు కొద్దిగా వంచి ఆసనం అలవాటు చేసుకోవచ్చు.

బద్ధకోణాసనం

ఈ ఆసనంతో తొడలు, కటి ప్రదేశం, మోకాళ్లు సాగుతాయి. ఆ ప్రదేశాల్లో ఉన్న ఇబ్బందులు తొలగి సంబంధిత అవయవాలను తేలికగా, ఎటువంటి ఆటంకం లేకుండా కదిలించగులగుతారు. ఈ ఆసనం ఎలా వేయాలంటే...

- కాళ్లను ఎదురుగా ఉంచి కూర్చోవాలి.
- కాళ్లను శరీరానికి దగ్గరగా మడిచి, రెండు పాదాలను సాధ్యమైనంతగా దగ్గరకు చేర్చాలి.
- రెండు చేతులతో రెండు పాదాల బొటనవేళ్లను పట్టుకోవాలి.
- వెన్ను నిటారుగా ఉంచాలి.
- మోకాళ్లను నేలకు తాకించే ప్రయత్నం చేయకూడదు.
- తొడలు, పిరుదులు నేలకు సమాంతరంగా ఉండేలా చూసుకోవాలి.



వైసీపీపై ఈసీ చర్యలు తీసుకోవాలి

» వలంటీర్లను రోడ్డున పడేశాలా జగన్ వ్యాఖ్యలు: బొండా ఉమ

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): వలంటీర్లే వైసీపీ భవిష్యత్తు నేతలన్న జగన్‌పైన, వైసీపీపై ఎన్నికల కమిషన్ కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. శుక్రవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ఐదేళ్లుగా ప్రజాసేవకులని చెప్పిన వలంటీర్లు ఎన్నికలకు రెండు నెలల ముందు వైసీపీ నాయకులు ఎలా అయ్యారో? జగన్ ఐదేళ్లలో వారికి రూ.9,663 కోట్లు ప్రజల సొమ్ము ఎలా దోచిపెట్టాడో ఈసీ ప్రశ్నించాలి. ఐదేళ్లుగా వలంటీర్ల సేవలు పొందిన వైసీపీ గుర్తింపు రద్దు చేసి, ఎన్నికల్లో పోటీ చేయకుండా చర్యలు తీసుకోవాలి. వలంటీర్లు ఇప్పటికైనా వాస్తవాలు గ్రహించి జగన్‌పై, వైసీపీ నేతలపై తిరగబడాలి. లోకేశ్ వలంటీర్లను రెగ్యులరైజ్ చేసి వారికి వేతనాలు పెంచుతామని ఇప్పటికే హామీ ఇచ్చారు. ఆయన చెప్పింది జరగకూడదన్న దురుద్దేశంతో జగన్ వలంటీర్లను పూర్తిగా రోడ్డున పడేసేలా వ్యాఖ్యానిస్తున్నారు' అని విమర్శించారు.

ధర్మారెడ్డీ.. తిరుమలలో ధర్మమేదీ: సప్తగిరి ప్రసాద్

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): తిరుమల క్షేత్రంలో ధర్మం ఎక్కడుందని టీడీపీ అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ ప్రశ్నించారు. శుక్రవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'జగన్‌రెడ్డి పాలనలో తిరుమలలో భూకబ్జాలు, ఆక్రమణలు పెచ్చుమీరాయి. వైసీపీ నేతలు తిరుమల, తిరుపతిలో ఎక్కడా సెంటు భూమి వదలకుండా కబ్జా చేస్తున్నారు. విచ్చలవిడిగా అక్రమ కట్టడాలు చేస్తున్నారు. శారదా పీఠం భూ ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు టీటీడీ ఈవో ధర్మారెడ్డికి కనిపించడం లేదా? రాష్ట్ర హైకోర్టు అడ్వకేట్ కమిషన్ నియమించే వరకు నిద్రపోయాడా? శారదా పీఠం ఆక్రమించిన 4,817 చ.అడుగుల భూమిని ఏ చట్టప్రకారం రెగ్యులరైజ్ చేశారో జవాబు చెప్పరా? స్వామి వారి గోపురం ఎత్తుని మించి శారదాపీఠం నిర్మాణాలు జరుగుతుంటే టీటీడీ ఇంజనీరింగ్, విజిలెన్స్ విభాగాలు ఏం చేస్తున్నాయి? తిరుమల కొండపై చిన్న చిన్న దళారుల స్థానంలో వైసీపీ ఎమ్మెల్యేలు రంగప్రవేశం చేసిన మాట నిజం కాదా? వీఐపీ బ్రేక్ దర్శనం, ఆర్జిత సేవా టికెట్లను తన వర్గం ఎమ్మెల్యేలకు ఎక్కువగా ఇచ్చి, ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలకు తక్కువగా కేటాయించిన మాట నిజం కాదా? వీటిపై శ్వేతపత్రం ఇస్తారా? తిరుమల కొండపై అక్రమాలను స్వామి చూడలేదనుకుంటున్నారేమో.. వ్యవస్థల్ని మేనేజ్ చేసినట్లు స్వామి వారిని మేనేజ్ చేయలేరు' అని హెచ్చరించారు.

ఈ ఏడాది ఏపీ అప్పు 1,05,200 కోట్లు: జీవీ

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వం 24వ సారి ఎఫ్ఆర్‌బీఎం పరిధి దాటిందని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి జీవీరెడ్డి తెలిపారు. ఈ వారం ఆర్బీఐ నుంచి మరో రూ.900 కోట్లకు ఇండెంట్ పెట్టింది. ఈ ఏడాది తెచ్చిన అప్పు రూ.1,05,200 కోట్లు. దీంతో అప్పు 347.48 శాతానికి చేరింది. ఇది గిన్నిస్ బుక్‌లో ఎక్కించాల్సిన రికార్డు అని శుక్రవారం ఎక్స్‌లో వ్యాఖ్యానించారు.

కూర్చున్న శునకాన్ని తరిమేస్తాం: బుద్దా వెంకన్న

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): 'ఇక్కడున్నది సింహాసనం.. కుర్చీ కాదు మడత పెట్టడానికి' అని మంత్రి అంబటి రాంబాబు ఎక్స్‌లో చేసిన వ్యాఖ్యలకు టీడీపీ నేతలు శుక్రవారం స్ట్రాంగ్‌గా కౌంటర్లు ఇచ్చారు. 'గతంలో అది సింహాసనమే. ప్రస్తుతం అది గ్రామ సింహాసనం. దానికి ఆ పేరు తెచ్చిన ఘనత ఎవరిదో నీకు తెలుసుగా అంబటి?' అంటూ మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న కౌంటర్ ఇస్తూ... 'మేం కూడా అదే చెబుతున్నాం అంబటి.. కుర్చీ అయితే మడత పెడతాం. సింహాసనం అయితే... దాని మీదున్న శునకాన్ని తరిమేస్తాం. ఇది ఓకేనా?' అని ప్రశ్నించారు.

జగన్ సింహం కాదు.. చిట్టెలుక: రఘురామ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ సింహం కాదు.. చిట్టెలుక అని ఎంపీ రఘురామకృష్ణరాజు ఎద్దేవా చేశారు. గంగ చంద్రముఖిగా మారడం రొటీనే కానీ సింహం చిట్టెలుకగా మారడమే వెరైటీ అని అపహాస్యం చేశారు. శుక్రవారం ఢిల్లీలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబుకు ఓటు వేస్తే, మీ ఇంటికి చంద్రముఖి వస్తుందని జగన్ ముద్దుముద్దుగా మాట్లాడుతున్నారని, చంద్రముఖి అంత చెడ్డ క్యారెక్టర్ ఏమీ కాదని సెటైర్లు వేశారు. 'రాజధాని ఫైల్స్' సినిమా బాటలోనే ఇంకా చాలా సినిమాలు రావచ్చని చెప్పారు. మనసున్న ప్రతి ఒక్కరూ ఒక్కసారైనా ఈ సినిమాను చూసి అమరావతి రైతులకు సంపూర్ణ మద్దతు తెలపాలని కోరారు.

'ఎడెక్స్'తో ప్రభుత్వం ఒప్పందం

ఆన్‌లైన్‌లో 2 వేల విదేశీ వర్సిటీల కోర్సులు చదివేందుకు అవకాశం

12 లక్షల మందికి లబ్ధి: సీఎం జగన్



ఎడెక్స్‌తో ఒప్పంద కార్యక్రమంలో సీఎం జగన్, సంస్థ ప్రతినిధులు

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు విదేశీ యూనివర్సిటీల్లోని కోర్సులను ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తెచ్చేందుకు ఈ-లెర్నింగ్ ప్లాట్‌ఫామ్ 'ఎడెక్స్' సంస్థతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. సీఎం జగన్ సమక్షంలో శుక్రవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఈ ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్నత విద్య చదువుతున్న 12 లక్షల మంది విద్యార్థులకు 2 వేల ఆన్‌లైన్ కోర్సులు అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రపంచంలోని టాప్ యూనివర్సిటీల్లో ఉండే కోర్సులను విద్యార్థులు ఎంపిక చేసుకుని, ఇక్కడి యూనివర్సిటీ ద్వారా ఆన్‌లైన్‌లో చదవొచ్చని తెలిపారు. 'ఎడెక్స్' సీఈవో అనంత్ అగర్వాల్ మాట్లాడుతూ.. ఉన్నత విద్యలో ఈ ఒప్పందం ఒక గేమ్ చేంజర్ అవుతుందని అభిప్రాయపడ్డారు.



వైసీపీని వీడి టీడీపీలో చేరిన దళిత కుటుంబాలు

రాయదుర్గం, ఫిబ్రవరి 16: అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గంలో 1,144 దళిత కుటుంబాలు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరాయి. ఇది చరిత్రాత్మకమని మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు అన్నారు. రాయదుర్గం పట్టణంలో శుక్రవారం దళిత గర్జన నిర్వహించారు. ఈ వేదిక మీద నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 1,144 దళిత కుటుంబాలు పసుపు కండువా కప్పుకున్నాయి. టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ రాజు, కాల్వ శ్రీనివాసులు వారిని సాదరంగా ఆహ్వానించారు. అంతకు మునుపు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. దళితులకు వైఎస్ జగన్ చేస్తున్న అన్యాయాన్ని జీర్ణించుకోలేక, రాష్ట్ర భవిష్యత్తుకు చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం చాలా అవసరమని భావించి పార్టీలో చేరామని దళితులు తెలిపారు.

జగన్ పర్యటన ఉందని... లోకేశ్ సభకు అనుమతి నిరాకరణ!

విశాఖపట్నం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పర్యటన ఉందని, టీడీపీ శంఖారావం సభకు విశాఖ పోలీసులు అనుమతి నిరాకరించారు. దాంతో టీడీపీ తన కార్యక్రమం మార్చుకోవలసి వచ్చింది. శారదా పీఠం వార్షికోత్సవంలో పాల్గొనేందుకు ఈ నెల 19న సీఎం విశాఖపట్నం రానున్నారు. ఇదిలావుండగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం శనివారం (17వ తేదీ) నుంచి విశాఖపట్నంలో మొదలవుతోంది. ఈ పర్యటన ముందుగానే ఖరారైంది. ఈ నెల 19వ తేదీ ఉదయం విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో లోకేశ్ సభ నిర్వహించాల్సి ఉంది. అదే మార్గంలో సీఎం శారదా పీఠానికి వెళతారు కాబట్టి ఎవరికీ ఆ ప్రాంతంలో సభల నిర్వహణకు అనుమతి ఇవ్వబోమని పోలీసులు చెప్పారు. దాంతో లోకేశ్ పశ్చిమ నియోజకవర్గం సభను 19 నుంచి 18వ తేదీ రాత్రికి మార్చుకున్నారు. 19వ తేదీన విశాఖ ఉత్తర నియోజకవర్గంలో పర్యటన ఏర్పాటు చేసుకున్నారు.

సంగీత కళాశాల విశ్వవిద్యాలయంగా ఎదగాలి









● ముగిసిన దక్షిణ భారత సంగీతోత్సవం

తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 16: తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర సంగీత నృత్య కళాశాల ఎందరో గొప్ప కళాకారులను సమాజానికి అందించిందని, వజ్రోత్సవాలకు దగ్గరవుతున్న ఈ సమయంలో కళాశాల సంగీత విశ్వవిద్యాలయంగా ఏర్పడాలని ఏడుకొండలవాడిని ప్రార్థిస్తున్నట్లు పద్మశ్రీ ఎల్లా వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మహతిలో కళావైభవం పేరుతో జరిగిన దక్షిణ భారత సంగీత-నృత్య ఉత్సవాల ముగింపు సభలో ఆయన మాట్లాడుతూ కళలకు ఎంతో శక్తి ఉందన్నారు. దక్షిణ భారత స్థాయిలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం సులభం కాదన్నారు. ఇదే స్ఫూర్తితో టీటీడీ జాతీయ, అంతర్జాతీయ స్థాయి సంగీతోత్సవాలను తిరుపతిలో నిర్వహించాలన్నారు. కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాదుకు చెందిన నాట్య గురువు, విశ్రాంత ఆచార్యులు పసుమర్తి రామలింగ శాస్త్రి, టీటీడీ సీపీవో శేషశైలేంద్ర, డీఈవో భాస్కరరెడ్డి, శ్రీవేంకటేశ్వర సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపాల్ ఉమ ముద్దుబాల పాల్గొన్నారు. ఎల్లా వెంకటేశ్వరరావు, గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్, రామలింగ శాస్త్రిలను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. మూడు రోజులుగా ప్రదర్శనలిచ్చిన వివిధ రాష్ట్రాల విద్యార్థి బృందాలను, కళాకారులను జ్ఞాపిక, ధృవపత్రాలతో సత్కరించారు.



మాట్లాడుతున్న ఎల్లా వెంకటేశ్వరరావు

ఆకట్టుకున్న చివరి రోజు ప్రదర్శనలు

చివరి రోజు ఉదయం శ్రీవేంకటేశ్వర సంగీత నృత్య కళాశాల విద్యార్థుల వయోలిన్ కచేరి ఆహూతులను అలరించింది. మద్రాసు విశ్వవిద్యాలయం సంగీత విద్యార్థుల గాత్ర కచేరీ అలరించింది. కేరళలోని ఎర్నాకులం జిల్లా త్రిపునితుర పట్టణానికి చెందిన ఆర్.ఎల్.వి. ప్రభుత్వ సంగీత, లలిత కళల కళాశాల విద్యార్థుల జుగల్‌బందీ సమ్మోహన పరచింది. తమిళనాడు తిరువారూరుకు చెందిన కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ వి.ప్రేమలత సంగీత - సాహిత్యాలపై ప్రసంగించారు. సాయంత్రం తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర సంగీత నృత్య కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన శ్రీకృష్ణలీలావిలాసం నృత్యరూపకం ఆకట్టుకుంది. తమిళనాడు తిరువైయ్యూరు ప్రభుత్వ సంగీత కళాశాల విద్యార్థుల వాద్య కచేరీ జరిగింది. హైదరాబాదు హరిహర ఫైన్ ఆర్ట్స్‌కు చెందిన విద్యార్థులు శ్రీరామ కథాసారం అనే కూచిపూడి నృత్యరూపకం ఆకర్షణీయంగా సాగింది.

టీడీపీ హామీలకు భారీ స్పందన: కూన

అమరావతి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఇచ్చిన హామీలను విశ్వసించి వాటిని పొందడం కోసం రాష్ట్రంలో 95 లక్షల కుటుంబాలు నమోదు చేయించుకున్నాయని మాజీ విప్ కూన రవికుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన ఇక్కడ తమ పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'భవిష్యత్తుకు గ్యారంటీ పేరుతో టీడీపీ ఆరు హామీలు ఇచ్చింది. టీడీపీ శ్రేణులు రాష్ట్రంలో ప్రతి ఇంటికి వెళ్లి వీటి గురించి వివరించి ఏ ఇంటికి ఎంతెంత ప్రయోజనం కలుగుతుందో ఒక హామీ పత్రం కూడా ఇస్తున్నాం. వీటిని విశ్వసించి ఈ హామీ పత్రం తీసుకోవడానికి 95 లక్షల కుటుంబాలు ముందుకు వచ్చి నమోదు చేయించుకొన్నాయి. ఏ నియోజకవర్గంలో ఏ రోజు ఎంత మంది నమోదు చేయించుకొన్నారో మాకు ప్రతి రోజూ సమాచారం అందుతోంది. టీడీపీ పట్ల, పార్టీ అధినేత చంద్రబాబు పట్ల ప్రజల్లో ఉన్న నమ్మకానికి ఇది నిదర్శనం' అని కూన చెప్పారు. ఈ హామీలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో విజయవంతమైన టీడీపీ శ్రేణులు జనసేనతో కలిసి ఇరు పార్టీల విజయానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. వలంటీర్లను ఎదురుగా పెట్టుకొని ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి హింసాత్మక వ్యాఖ్యలు చేశారని, ఆయన భాషపై ఎన్నికల సంఘం తక్షణం చర్యలు తీసుకోవాలని కూన డిమాండ్ చేశారు.

ఛలో విజయవాడ పోస్టర్ ఆవిష్కరణ

పాకాల, ఫిబ్రవరి 16: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం ఏపీసీపీ ఎస్‌సీపీఏ ఆధ్వర్యంలో సీపీఎస్ రద్దు ఓట్ ఫర్ ఓపీఎస్ ఛలో విజయవాడ పోస్టర్‌ను ఆ సంఘ నాయకులు ఆవిష్కరించారు. పాత పెన్షన్ పునరుద్ధరించాలని ఈనెల 18వ తేది చేపట్టే ఛలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.ఈశ్వరయ్య, వెంకటయ్య మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేస్తామని ఎన్నికలకు ముందు సీఎం జగన్ పాదయాత్రలో చెప్పారని, అధికారంలోకి వచ్చాక సీపీఎస్ రద్దు చేయకుండా జీపీఎస్ అనే గోల్‌మాల్ పెన్షన్ స్కీమ్ ఇచ్చి ఉపాధ్యాయ ఉద్యోగులను మోసం చేశారన్నారు. సీపీఎస్ రద్దుకు చేపట్టిన ఛలో విజయవాడ కార్యక్రమానికి ఉపాధ్యాయులు, ఉద్యోగులు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఓబయ్య, జయచంద్ర, నాగేంద్ర, భాగ్యలక్ష్మి, ద్రాక్షాయణి, కళావతి, యుగంధర్, రెడ్డిపురుషోత్తం, రెడ్డప్పరెడ్డి, నవీన్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కంటి చికిత్స శిబిరం

పాకాల, ఫిబ్రవరి 16: పాకాల ప్లాటినం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శంకర్ నేత్రాలయ సహకారంతో ఈనెల 18వ తేదీన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మారసాని విజయబాబు తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో ఉదయం 9గంటలకు శిబిరం ప్రారంభమవుతుందన్నారు. కంటి సమస్యలున్నవారు ఆధార్ కార్డు తీసుకొని రావాలని ఆయన కోరారు. ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి చెన్నై శంకర్ నేత్రాలయంలో ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామన్నారు.

పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్యకు పతీ వియోగం



రామకృష్ణారెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్

రాంనగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) జాతీయ కన్వీనర్ వి.సంధ్య జీవిత భాగస్వామి, కవి, నవ్య ప్రింటింగ్ ప్రెస్ సంస్థ యజమాని రామకృష్ణారెడ్డి (62) శుక్రవారం ఉదయం మృతిచెందారు. గత కొంత కాలంగా 'మల్టిపుల్ ఆర్గాన్ డిజార్డర్'తో బాధపడుతున్న ఆయనకు తీవ్రమైన గుండెపోటు రావడంతో ఇంట్లోనే కుప్పకూలిపోయారు. వెంటనే సమీపంలోని అపోలో ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. ఆయన అంత్యక్రియలు శనివారం ఉదయం 11 గంటలకు చిట్యాల సమీపంలోని నేరడ గ్రామంలోని వారి వ్యవసాయ క్షేత్రంలో నిర్వహిస్తారు. విప్లవ సాహిత్యాన్ని ముద్రిస్తున్నారనే కారణంతో పోలీసులు రెండేళ్ల క్రితం నవ్య ప్రింటింగ్ ప్రెస్‌పై దాడి చేసి సీజ్ చేయడం అప్పట్లో సంచలనంగా మారింది. విద్యార్థి దశలో పీడీఎస్‌యూలో చురుకుగా పాల్గొన్న రామకృష్ణారెడ్డి అదే యూనియన్‌లో పనిచేస్తున్న ఉద్యమ సహచరురాలు వి.సంధ్యను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత వై.వెంకటేశ్వర్లు, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, సీపీఐ(ఎంఎల్), సీపీఎం, సీపీఐ నాయకులు, కవులు, ప్రజా సంఘాల నాయకులు రామకృష్ణారెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

పంట పొలాల్లోకి యురేనియం వ్యర్థాలు



పులివెందుల నియోజకవర్గం కేకే కొట్టాల సమీపంలో లీకైన యూసీఐఎల్ వ్యర్థాలు, యురేనియం వ్యర్థాలు కనిపించకుండా ఎక్స్‌కవేటర్‌తో చదును చేస్తున్న దృశ్యం

» యూసీఐఎల్ టెయిలింగ్ పాండ్ పైప్‌లైన్ లీకేజీ

» ఎక్స్‌కవేటర్‌తో శుభ్రం చేయించిన అధికారులు

పులివెందుల, ఫిబ్రవరి 16: యురేనియం వ్యర్థాల విషయంలో యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (యూసీఐఎల్) నిర్లక్ష్యం మరోసారి బయటపడింది. వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గం ఎం.తుమ్మలపల్లె వద్దనున్న యూసీఐఎల్‌లో నాలుగు రోజులుగా భద్రతా వారోత్సవాలు జరుగుతున్నాయి. ఈ సమయంలోనే టెయిలింగ్ పాండ్‌కు వ్యర్థాలను తరలించే పైప్‌లైన్ లీకేజీ కావడం కలకలం రేపుతోంది. యురేనియం వ్యర్థాలను నిల్వ చేసే టెయిలింగ్ పాండ్‌ను నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలి. కానీ ఇక్కడ పదేపదే పైప్‌లైన్ లీక్ కావడం పరిపాటిగా మారింది. గురువారం యూసీఐఎల్ నుంచి టెయిలింగ్ పాండ్‌కు వ్యర్థాలను తరలించే పైప్‌లైన్ లీకేజీ అయింది. దాదాపు 12 నుంచి 15గంటల పాటు వ్యర్థాలు పొలాల్లోకి ప్రవహించాయి. దీనిని గమనించిన కొందరు రైతులు యూసీఐఎల్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో శుక్రవారం పైప్‌లైన్‌కు మరమ్మతులు చేశారు. ఆ వ్యర్థాలను పొరపాటున ఎవరైనా తాకితే చర్మం పూర్తిగా ఊడిపోతుందని చెబుతున్నారు. ఇలాంటి ప్రమాదం జరుగుతుందనే ఆందోళనతో అప్పటికప్పుడు ఎక్స్‌కవేటర్‌తో ఆ ప్రదేశాన్ని శుభ్రం చేయించారు. ఈ పనులను ఫొటోలు తీస్తున్న కేకేకొట్టాల వాసులను యూసీఐఎల్ సిబ్బంది అడ్డుకొని అక్కడినుంచి పంపేశారు. దీనిపై యూసీఐఎల్ అధికారులను వివరణ కోరేందుకు 'ఆంధ్రజ్యోతి' ప్రయత్నించగా ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు. టెయిలింగ్ వ్యవహారాన్ని యూసీఐఎల్ గాలికి వదిలేసిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.



వైసీపీ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్‌ను నిలదీస్తున్న ట్యాంకర్ల యజమానులు

నీళ్ల బిల్లులు చెల్లించండి మహాప్రభో!

» మా జేబులు గుల్ల చేసుకొని జనం గొంతులు తడిపాం

» రోడ్డెక్కిన వైసీపీ సర్పంచులు, ట్యాంకర్ల యజమానులు

ఎర్రగొండపాలెం, ఫిబ్రవరి 16: 'గ్రామాల్లో నాలుగేళ్ల నుంచి ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేశాం. జేబులు గుల్ల చేసుకొని జనం గొంతు తడిపాం. మాకు బిల్లులు ఇప్పించండి మహాప్రభో' అంటూ వైసీపీ సర్పంచ్‌లు, ట్యాంకర్ల యజమానులు శుక్రవారం రోడ్డెక్కారు. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం ఆర్టీసీ బస్టాండ్ ఎదుట 20 నిమిషాల పాటు రాస్తారోకో చేశారు. దీంతో మార్కాపురం నుంచి మాచర్ల వైపు వెళ్లే వాహనాలు నిలిచిపోయాయి. ట్యాంకర్ల యజమానుల సమన్వయకర్త రమణారెడ్డి మాట్లాడుతూ.. తమకు నాలుగేళ్లుగా బిల్లులు రాలేదన్నారు. దీంతో నీటిని సరఫరా చేయకలేకపోతున్నామని తెలిపారు. తమను గ్రామాల్లో జనంతో పాటు పార్టీ కార్యకర్తలు కూడా విశ్వసించని పరిస్థితి నెలకొందని వాపోయారు. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో 3 నెలలకే బిల్లులు వచ్చేవని, తమ ప్రభుత్వంలో అసలు పట్టించుకోవడం లేదని అన్నారు. ఈ బిల్లులు రాకపోతే ఆస్తులు అమ్ముకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న వైసీపీ ఇన్‌చార్జ్ తాటిపర్తి చంద్రశేఖర్‌ను చుట్టుముట్టి తమ బిల్లులు ఎప్పుడు ఇప్పిస్తారో తేల్చాలని నిలదీశారు. ప్రభుత్వం నుంచి వెంటనే బిల్లులు ఇప్పిస్తానని చంద్రశేఖర్ హామీ ఇవ్వడంతో వైసీపీ నాయకులు ఆందోళన విరమించారు.

కర్నూలు జీజీహెచ్‌లో కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు విజయవంతం



కిడ్నీ మార్పిడి చేయించుకున్న కర్నూలు, కడప జిల్లాల రోగులతో జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటరంగారెడ్డి

కర్నూలు (హాస్పిటల్), ఫిబ్రవరి 16: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రెండు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్లు విజయవంతమయ్యాయి. కడప పట్టణానికి చెందిన ఎస్తేర్ రాణి (44) కర్నూలు జిల్లా సి.బెళగల్‌కు చెందిన వీరన్న (26)లకు కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు వైద్యులు నిర్వహించారు. కడపకు చెందిన ఎస్తేర్ రాణి ఈ నెల 5న కిడ్నీ వ్యాధితో బాధపడుతూ కర్నూలు జీజీహెచ్‌లో చేరింది. ఇదే సమయంలో కర్నూలు నగరానికి చెందిన పావనిలత (26) అనే మహిళ బ్రెయిన్ డెడ్ అయింది. ఆమె తల్లిదండ్రులు కిడ్నీలతో పాటు కళ్లు, లివర్, ఊపిరితిత్తులను దానం సేందుకు అంగీకరించారు. వాటిలో కిడ్నీని కర్నూలు కిమ్స్‌కు ఇవ్వగా, మరో కిడ్నీని కర్నూలు జీజీహెచ్‌కు తరలించారు. ఇక్కడ దాన్ని ఈ నెల 6న కడప మహిళకు అమర్చారు. అలాగే కర్నూలు జిల్లా సి.బెళగల్ మండలానికి చెందిన ఈరన్న (26)కు ఆయన తల్లి ఈరమ్మ కిడ్నీ ఇవ్వడంతో గత నెల 29న ఆ కిడ్నీని వైద్యులు అమర్చారు. కిడ్నీ మార్పిడి చేయించుకున్న ఇద్దరు రోగులు శుక్రవారం ఉదయం డిశ్చార్జ్ అయ్యారు. ఈ సందర్భంగా కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ చింతా ప్రభాకర్ రెడ్డి, యూరాలజీ హెచ్‌వోడీ డాక్టర్ సీతారామయ్య విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోనే తొలిసారిగా బ్రెయిన్ డెడ్ అయిన రోగి నుంచి సేకరించిన కిడ్నీని మరో రోగికి కడావర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ద్వారా అమర్చినట్లు తెలిపారు.

విశాఖ రాజధాని వెనుక భారీ కుట్ర: రమేశ్‌నాయుడు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ పాలనలో ఆంధ్రప్రదేశ్ సర్వనాశనమైందని బీజేపీ ఏపీ రాష్ట్ర కార్యదర్శి రమేశ్‌నాయుడు ఆరోపించారు. విశాఖను రాజధానిని చేయాలనే జగన్ ఆలోచన వెనుక భారీ కుట్ర దాగుందన్నారు. శనివారం నుంచి ఢిల్లీలో రెండు రోజుల పాటు బీజేపీ జాతీయ మండలి సమావేశాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా న్యూఢిల్లీలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'విశాఖలో సీఎం జగన్‌కు 6,000 ఎకరాల భూమి ఉంది. అందుకే విశాఖను రాజధానిని చేయాలని అనుకున్నారు. ఏపీలో భూములను వైసీపీ నేతలకు కట్టబెట్టేందుకు అధికారులు అన్నివిధాలా సహకరించారు' అని ఆరోపించారు.

గిట్టుబాటు ధరపై చట్టం తేవాలి

» రోడ్డెక్కిన రైతులు, కార్మికులు.. వామపక్షాల ఆధ్వర్యంలో నిరసనలు

ఒంగోలు, నెల్లూరు, ఫిబ్రవరి 16: రైతులు పండించిన పంటలకు కేంద్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించేందుకు వెంటనే చట్టం తీసుకురావాలని వామపక్ష, ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. నెల్లూరు జిల్లాలో వారు తలపెట్టిన గ్రామీణ, పట్టణ బంద్ శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. నెల్లూరు నగరంతోపాటు కావలి, ఆత్మకూరు, కందుకూరుల్లో బంద్ జరిగింది. సీపీఎం సీపీఐ, న్యూడెమోక్రసీ నేతలు పాల్గొన్నారు. ప్రకాశం జిల్లాలో సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె విజయవంతమైంది.

12 పాలిటెక్నిక్‌లకు ఎన్‌బీఏ గుర్తింపు

అమరావతి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 12 ప్రభుత్వ పాలిటెక్నిక్‌లకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రెడిటేషన్(ఎన్‌బీఏ) గుర్తింపు లభించిందని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకూ 31 పాలిటెక్నిక్‌లలో 60 విభాగాలకు ఎన్‌బీఏ దక్కిందన్నారు. కొత్తగా అనంతపురం, శ్రీశైలం, తిరుపతి, పిల్లరిపట్టు, శ్రీకాకుళం, రాజమండ్రి, జమ్మలమడుగు, కదిరి పాలిటెక్నిక్‌లున్నాయని.. నందిగామ, పలమనేరు, కడప మహిళా పాలిటెక్నిక్‌లతో పాటు మదనపల్లె మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్‌కు గుర్తింపు దక్కిందన్నారు.

భీమవరంలో ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిల్ సభలు

అమరావతి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభలు శని, ఆదివారాల్లో భీమవరంలో జరుగుతాయని ఎస్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయిశ్రీనివాస్, హెచ్.తిమ్మన్న ఓ ప్రకటనలో తెలిపారు. 300 మంది రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఇందులో పాల్గొంటారన్నారు.

ఎక్కడ పుడితేనేం.. జగన్‌లా జనం రక్తం పీల్చలేదు

» మంత్రి పెద్దిరెడ్డి వ్యాఖ్యలపై సత్యకుమార్ ధ్వజం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): 'ఎక్కడ పుడితేనేమి... జగన్‌లా జనం రక్తమేమీ పీల్చలేదు. ఆంధ్రప్రదేశ్ ఏమైనా మీ సామ్రాజ్యమా? లేక బీసీలందరూ మీ బానిసలా..!' అంటూ బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ నిలదీశారు. సత్యకుమార్ ఎక్కడో పుట్టి ఏపీలో ఎలా పోటీ చేస్తారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మీడియా సమావేశంలో వ్యాఖ్యానించారు. దీనిపై సత్యకుమార్ శుక్రవారం ఎక్స్‌లో స్పందించారు. ఎక్కడ పుట్టారు? ఎక్కడ పెరిగారని జగన్ తన తల్లిని విశాఖపట్నంలో ఎంపీగా నిలబెట్టారు? నెల్లూరు ఎమ్మెల్యేను నరసరావుపేట ఎలా పంపారని నిలదీశారు.

కోస్తాలో చలిగాలులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాది నుంచి మధ్య భారతం మీదుగా రాష్ట్రంలోని కోస్తా వరకు చలిగాలులు వీచాయి. దీంతో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు చలి కొనసాగింది. దీనికితోడు మంచు దట్టంగా కురిసింది. అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో 6.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కాగా శుక్రవారం పగటిపూట ఎండ తీవ్రత కొనసాగింది. నందిగామలో 36.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

చంద్రబాబుపై మరో చార్జిషీటు

ఈసారి 'ఫైబర్‌నెట్' కేసులో!.. ఇప్పటికే ఐఆర్ఆర్ కేసులో దాఖలు

విజయవాడ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబుపై సీఐడీ అధికారులు కోర్టులో మరో చార్జిషీటు దాఖలు చేశారు. ఈసారి ఫైబర్‌నెట్ కేసులో ఆయన్ను ప్రధాన నిందితుడిగా చేర్చుతూ.. ఐపీసీ 166, 167, 418, 465, 468, 471, 409, 506, రెడ్‌విత్ 120(బి), ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ చట్టంలోని 13(2), రెడ్‌విత్ 13(1)(సీ)(డీ) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. సంబంధిత చార్జిషీటును శుక్రవారం విజయవాడ ఏసీబీ కోర్టులో దాఖలు చేశారు. ఫైబర్‌నెట్ మొదటిదశలో కుంభకోణం జరిగిందని అందులో పేర్కొన్నారు. 'చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు నేరపూరిత ఆలోచనతో వి.హరికృష్ణప్రసాద్‌ను గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడిగా నియమించారు. ప్రాజెక్టు అంచనా, పరికరాలకు మార్కెట్‌లో ఉన్న ధరలను పరిశీలించకుండానే అనుమతులు ఇచ్చారు. ఈ విషయంలో ఆయన ప్రభుత్వ సీనియర్ అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చారు. టెండర్ల కమిటీలో హరికృష్ణ ప్రసాద్ ఉన్నారు. నిబంధనలను ఉల్లంఘించి బ్లాక్‌లిస్ట్‌లో ఉన్న టెరాసాఫ్ట్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకి టెండర్‌ను కట్టబెట్టారు. మిగిలిన టెండరుదారులు గొడవ చేయకుండా టెర్రాసాఫ్ట్ కంపెనీ.. వారికి ముడుపులు ముట్టజెప్పింది. ప్రస్తుతం దక్షిణ మధ్య రైల్వేలో చీఫ్ కమర్షియల్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్న కోగంటి సాంబశివరావు లోగడ ఏపీఎస్ఎఫ్ఎల్ ఎండీగా, ఇన్‌క్యాప్ వీసీ అండ్ ఎండీగా వ్యవహరించారు. ఆయన టెండర్ ప్రక్రియను తారుమారు చేశారు. టెండర్ల ప్రక్రియ ముగిసే రోజున బ్లాక్‌లిస్ట్‌లో ఉన్న టెరాసాఫ్ట్‌ను అందులో నుంచి తొలగించారు. టెరాసాఫ్ట్ కంపెనీకి, హరికృష్ణప్రసాద్‌కు మధ్య జరిగిన ఒప్పందంతోనే ఇదంతా చేశారు. ఈ కంపెనీకి అధికారులు టెండర్ కట్టబెట్టారు. ఇది ఎలాంటి నాణ్యత లేకుండా పనులు నిర్వహించింది. ఫైబర్‌నెట్‌లో ఈ కంపెనీకి రూ.330 కోట్ల వరకు మేలు చేసేలా అధికారులు వ్యవహరించారు. టెండర్ కమిటీ నిర్వాకంతో ప్రభుత్వానికి రూ.114 కోట్ల నష్టం కలిగింది. వివిధ కంపెనీలకు సంబంధించిన నకిలీ ఇన్వాయిస్‌లతో నిధులను దుర్వినియోగం చేశారు. టెరాసాఫ్ట్ కంపెనీకి ప్రభుత్వం రూ.333 కోట్లు కట్టబెట్టింది. ఈ కంపెనీ టెరామీడియా క్లౌడ్ కంపెనీకి అనుబంధం. టెరామీడియా క్లౌడ్‌లో హరికృష్ణప్రసాద్ భాగస్వామి. చంద్రబాబు చెప్పినట్లే హరికృష్ణ ప్రసాద్ చేశారు. కేసులో ఉన్న సీనియర్ అధికారులను కోర్టు ముందు ప్రవేశపెట్టాం. తర్వాత స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబును అరెస్టు చేశాం. ఫైబర్‌నెట్ కేసులో విచారించడానికి అనుమతి ఇవ్వాలని పీటీ వారెంట్ దాఖలు చేశాం. స్కిల్ డెవలప్‌మెంట్, ఫైబర్‌నెట్ కేసులు ఏసీబీ కోర్టులో ఉన్నాయి. చంద్రబాబు బెయిల్ కోసం వేసిన పిటిషన్‌ను ఏసీబీ కోర్టు, హైకోర్టు తోసిపుచ్చాయి. ఆ తర్వాత ఆయన సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. దీని విచారణ పెండింగ్‌లో ఉంది' అని సీఐడీ చార్జిషీటులో తెలిపింది. దీనిపై ఏసీబీ కోర్టు ఇంకా ఎలాంటి నిర్ణయాన్ని వెల్లడించలేదు. చంద్రబాబుపై ఇదివరకే ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్ఆర్) కేసులో చార్జిషీటు దాఖలు చేసిన సంగతి తెలిసిందే.